
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 | సంచిక : 3 | నవంబర్ 2006

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 5/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ఆకివీడు ............ 02-09-06
గోడిపాలెం ........ 10-09-06
మాగం .............. 11-09-06
కైకలూరు ........... 10-10-06

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-09-06, ఆకివీడు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏ పని చేసినా ఈ లోకానికి సంబంధించిన పని చేసినా, నిర్వాణసుఖాన్ని పొందటానికి ప్రయత్నం చేసినా ఈశ్వరుని యొక్క దయలేకుండా మనం ఏదీ సాధించలేము, ఇది ముందు మనకు అర్థమవ్వాలి. ఈశ్వరుని యొక్క అనుగ్రహం లేకుండా ఇహంలో గాని, పరంలోగాని మనం ఏదీ సాధించలేము. అందుచేతనే ఏ పని చేస్తున్నా ముందు గణపతి పూజ చేస్తారు, గణపతి అంటే గణపతి రూపంలో ఉన్న ఈశ్వరుడు. మనందరకు లోకజ్వరం ఎక్కువగా ఉంది. ఆ జ్వరం తగ్గాలంటే సజ్జనసాంగత్యం చెయ్యాలి. సత్సంగం వలన ప్రాపంచికవిషయాలతోటి సంబంధం తగ్గిపోతుంది. మట్టిని కుండల కింద చేస్తారు. అలా చేసేటప్పుడు కుమ్మరివాడు ఆమట్టిలో ఉన్న రాళ్లను, చెత్తను పూర్తిగా తీసేసి మట్టిని శుభ్రం చేస్తాడు. లేకపోతే కుండలు తయారయ్యాక బీటలు వచ్చేస్తాయి. మట్టిని శుభ్రం చెయ్యటానికి కుమ్మరివాడు ఎంత కష్టపడతాడో అలాగ మన మనస్సును శుద్ధిచెయ్యటానికి సజ్జనులు సహకరిస్తారు. అందుచేత సజ్జన సహవాసం కోసం అవసరమయితే భూమియొక్క అంచులదాక వెళ్లమని ఐన్‌స్టీన్ చెప్పాడు. ఒక్క ఆత్మవిద్య తప్పించి మిగిలిన విద్యలు అన్నీ పొట్టకు సంబంధించిన విద్యలే, ఈ ప్రపంచం ఎంత నిజమో, ఈ శరీరం ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. నీ పొట్టపోషణకు సహకరిస్తాయి గాని ఆ విద్యలు ఏమీ నీకు మోక్షాన్ని ఇవ్వవు. మిగతా విద్యలు అన్నీ విద్యల కింద కనిపించే అవిద్యలు అని శాస్త్రంలో చెప్పారు. ఒక్క ఆత్మవిద్య మాత్రమే నీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది, అదే నిజమైనవిద్య. సజ్జనసాంగత్యం వలన మనకు తెలియకుండా మనం

పవిత్రులమవుతాము, సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం ప్రాక్టీసు చెయ్యమని భగవద్గీతలో పరమాత్మ చెప్పాడు. ఎందుచేతనంటే సత్వగుణం కూడా గుణమే కాని అది మోక్షానికి దారి చూపించి ప్రక్కకు తప్పకొంటుంది. అందుచేత మనం సత్వగుణం అభివృద్ధి చేసుకోవాలి. వాలుగాలిలో సైకిలు తొక్కటం ఎలా ఉంటుందో మనం చేసే సాధనకు సత్వగుణం అలా సహకరిస్తుంది. అందుచేత సత్వగుణం చాలా ముఖ్యం.

మీరు నాయందు భక్తి కలిగి ఉంటే, నన్నే స్మరిస్తూ ఉంటే మీ యోగక్షేమములు చూసే బాధ్యత నాది అని పరమాత్మ చెప్పాడు. తల్లిదండ్రులను బాగాచూడాలి, పెద్దలను గౌరవించాలి అని చెపుతూ ఉంటారు, అది సామాన్య ధర్మం. అయితే ప్రహ్లాదుడు భగవంతుడి కోసం తండ్రిని విడిచిపెట్టాడు. అలాగే భగవంతుడి కోసం మనం సామాన్యధర్మాలను విడిచిపెట్టినా యిబ్బంది లేదు. దేవుడు లేడు, మోక్షం లేదు అని మీ ఇంటి దగ్గర చెపుతున్నారు అనుకోండి వారిని విడిచిపెట్టినా దోషం లేదు. మీరు ఆధ్యాత్మికమార్గంలో ప్రయాణం చేస్తున్నారు అనుకోండి మీ తల్లితండ్రులుగాని ఎవరైనా ఇతరులుగాని అడ్డువస్తున్నారు అనుకోండి మనం ప్రక్కకు తప్పకోవాలి, ప్రహ్లాదుడు అలాగే తప్పకొన్నాడు. నాయందు భక్తి కలిగి, నాకు శరణాగతి పొందితే గతజన్మలనుండి వచ్చిన దోషాలు నీ బుద్ధిలో ఎన్ని ఉన్నప్పటికీ ఆ దోషాల నుండి నిన్ను విడుదలచేసి, నిన్ను శుచిచేసి, మోక్షసామ్రాజ్యాన్ని నీకు ప్రసాదించే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ. ఇంక దుఃఖపడవలసిన పని ఏముంది. నమ్మినవాడికి సొమ్ము, నమ్మనివాడికి దుమ్ము. కొంతమంది మన నమ్మకాలను చెడగొడుతూ ఉంటారు, వారికి దూరంగా ఉండాలి. భగవంతుడి మీద ఉన్న నమ్మకాన్ని చెడగొట్టేవారు ఎవరైనా ఆయన దగ్గరకు వస్తే వారు వెళ్ళిపోయిన తరువాత ఆ గదిని శుభ్రంగా కడిగించేవారు రామకృష్ణుడు. భగవంతుడియందు మనకు ఉన్న విశ్వాసాన్ని కాపాడుకొంటూ రావాలి. విశ్వాసం ఎప్పడూ సమానంగా ఉండేలా చూసుకోవాలి. మనకు విషయబుద్ధిపోయి, ఆత్మ బుద్ధి కలగాలంటే దానికి సజ్జనసాంగత్యం ఒక మందు అని చెప్పారు. నేచురల్‌గా చక్కటి గాలి వీస్తూ ఉంటే మనకు ఫాన్‌గాలితో పని ఏముంది, అలాగే నీకు సజ్జనసాంగత్యం దొరికితే నీ జపధ్యానములతో సంబంధం లేకుండా నువ్వు నిర్వాణసుఖాన్ని పొందుతావు, సజ్జన సాంగత్యం యొక్క గొప్పతనం అట్టిది. పరమపవిత్రుడు ఎప్పడూ కపటంగా ఉండడు. మాకు కపటం లేదు అని మీరు చెప్పవచ్చు కాని లోపల అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు కదా. తలంపు రాకముందే నీలో ఏమి ఉందో ఆయనకు తెలుస్తుంది. లౌకికులతో చాలా ప్రమాదం, వారి వలన భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగా కాని మనకు కలిసివచ్చేది ఏమీ లేదు, మన మార్గాన్ని చెడగొడతారు. ఎందుకలా చెడగొడుతున్నారు అంటే అది వారి స్వభావం. అందుచేత లౌకికులతో బహుజాగ్రత్తగా ఉండాలి.

ఆధ్యాత్మికమార్గాన్ని విడిచిపెట్టకుండా ఉండాలంటే ఎంతో నైతికబలం ఉండాలి, మనో యోగం ఉండాలి. మనోయోగం అంటే మనస్సులో పవిత్రమైన భావాలు వస్తూ ఉండాలి. పూజకంటే జపం గొప్పది, జపం కంటే ధ్యానం గొప్పది, ధ్యానంకంటే భావన మంచిది అని చెపుతారు. మీకు నేను ఉపకారం చేయలేకపోవచ్చు కాని మీరు బాగుపడాలి, మీకు మోక్షం కలగాలి అనే మంచిభావన కలిగిఉండటంలో దారిద్ర్యం అక్కరలేదు, భావదారిద్ర్యం పనికిరాదు. భావన కంటే ప్రేమ గొప్పది, ఆ ప్రేమ వలన ఈశ్వరుడు నీకు వశీకరణమవుతాడు. శ్రీకృష్ణ చైతన్యకు ఉన్నది అంతా ప్రేమ, ఆ ప్రేమ వలన వాసుదేవస్వామిలో ఐక్యమయ్యాడు, వాసుదేవ స్వామి ఆ ప్రేమకు కట్టుబడిపోయాడు. మనకు ధనం లేకపోవచ్చు కాని భావదారిద్ర్యం ఉండకూడదు, భావదారిద్ర్యం ఉన్నవాడికి జ్ఞానం వచ్చే ప్రసక్తే లేదు. ఈ జీవుడు, దేవుడు ఒక్కటే. ఈ రెండింటిలో భేదం చూస్తున్నంతకాలం నీకు పునర్జన్మలు వస్తాయి. ఈ రెండింటిలో భేదం లేదని గ్రహిస్తే అదే తత్త్వజ్ఞానం. అది నోటితో చెపితే సరిపోదు, అది అనుభవైకవేద్యం. మనం కర్మను యోగంగా చేయము, కర్మను భోగిస్తాము. ఒక చిన్న పని చేస్తే, దాని ఫలితం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తాము. కర్మభోగులు జననమరణ చక్రంలో నుండి బయటకు రాలేరు, వారు మనుషులుగా జన్మించవచ్చు, జంతువులుగా జన్మించవచ్చు, ఉత్తమజన్మలు రావచ్చు, నీచజన్మలు రావచ్చు, ఇతర లోకాలకు ప్రయాణం చేయవచ్చు, మొత్తం మీద వాడికి ప్రయాణాలు తప్పవు. జీవుడు ఏ హృదయంలో నుండి అయితే వస్తున్నాడో అక్కడకు వెళ్ళి అందులో అణిగేవరకూ వాడికి జన్మలు తప్పవు, ఇందులో రాజీ లేదు. నువ్వు భక్తిమార్గంలో ప్రయాణం చెయ్యి, జ్ఞానమార్గంలో ప్రయాణం చెయ్యి. నీకు చిత్తశుద్ధి లేనప్పుడు నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా లాభం లేదు. నీకు జీవితంలో సమన్వయం లేదు. నీ ఆలోచనకు, మాట్లాడేమాటకు, చేతితో చేసే పనికి సమన్వయం లేదు అంటే త్రికరణశుద్ధి లేదు. మీకు చిత్తశుద్ధి లేనప్పుడు, త్రికరణశుద్ధి లేనప్పుడు మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఫలితం సున్నా. మీరు 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నారు అనుకోండి, బలానికి టానిక్‌లు తాగేస్తున్నారు అనుకోండి ఏమిటి ప్రయోజనం, ముందు జ్వరం తగ్గాలి కదా. జ్వరం తగ్గిన తరువాత బలం టానిక్ వాడితే ఎంతో కొంత ప్రయోజనం ఉంటుంది.

కర్మను యోగంగా చేస్తే వాసన పడదు, కర్మను భోగించటం వలన వాసన పడుతుంది. సర్వసాధారణంగా జీవుడు కర్మఫలాన్ని త్యాగం చేయడు, వాడు అనుభవిస్తాడు, అనుభవించటమే భోగించటం. కర్మఫలత్యాగే నిజమైనసన్యాసి, వాడే జ్ఞాని. ఒక త్యాగికి మాత్రమే భగవంతుడు చెప్పిన మాటలు వాడి అవగాహనకు అందుతాయి, ఆ మాటలు వాడికి అనుభవంలోనికి వస్తాయి. త్యాగి కానివాడికి జ్ఞానం లేదు. మనస్సు ఎక్కువగా బాహ్యాముఖానికి వెళుతూ ఉంటే రజోగుణం

ఎక్కువగా ఉన్నట్లు గుర్తు. సత్వగుణం వలన మనస్సుకు లోచూపు కలుగుతుంది, సత్వగుణం నీచేత మంచిపనులు చేయిస్తుంది, సత్వగుణం వలన మనలో ఉన్న పొరపాట్లు సవరించుకోగలము. రజోగుణం ఉన్నవాడు వాడిలోని పొరపాట్లు సవరించుకోడు సరికదా ఇతరులలోని పొరపాట్లు చూడటానికి రైలు దాటిపోతూ ఉంటే రైలు కోసం ఎంత వేగంగా పరిగెడతామో అంత వేగంగా పరిగెడతాడు. సత్వగుణం ఉంటే నీవు నిదానంగా ఆలోచించగలవు, నీవు మాట్లాడేమాట, చేసేపని నిర్మలంగా ఉంటుంది, నువ్వు చేసేపని ఇతరులకు తెలియాలి అని కూడా నీవు అనుకోవు. ఇతరులకు తెలియాలి అని నీకు ఎప్పుడైతే సంకల్పం వచ్చిందో అది రజోగుణ లక్షణం. ఇతరుల కళ్ళతో మిమ్మల్ని మీరు ఎప్పడూ చూసుకోవద్దు, మీ కళ్ళతో చూసుకోండి. మీ కళ్ళతో మిమ్మల్ని మీరు చూసుకొంటూ ఉంటే మీకు సత్వగుణం పెరుగుతుంది. చెట్టు మీద పక్షులు ఉన్నాయి అనుకోండి. ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి తప్పట్లు కొడితే పక్షులు ఎగిరిపోతాయి. నువ్వు నిరంతరం భగవంతుడిని స్మరిస్తున్నావు అనుకో, చెట్టు దగ్గర తప్పట్లు కొడితే పక్షులు ఎలా ఎగిరిపోతాయో, అలాగ నామస్మరణ వలన నీ బుద్ధిలో ఉన్న దోషాలు కూడా ఎగిరిపోతాయి. భగవంతుడిని నిరంతరం స్మరిస్తూ ఉంటే బుద్ధిలో దోషాలు ఉంటాయా? జలం ఏవిధంగా అయితే శరీరాన్ని శుభ్రం చేస్తుందో అలాగ నామస్మరణ నీ బుద్ధిని శుద్ధి చేస్తుంది. హరిని స్మరిస్తూ ఉంటే, శివస్మరణ చేస్తూ ఉంటే ఇంక దోషాలు ఏమిటి? గడ్డిపరకలు అన్నీ కలిసి తాడు కింద ఎలా తయారవుతాయో వాసనలు అన్నీ కలిసి మనస్సు కింద తయారవుతాయి. గడ్డితాడులోని గడ్డిపరకలను ఒకోదానిని తీసివేస్తే ఇంక తాడు లేదు. అలాగే మనస్సులో ఉన్న వాసనలను ఒకో వాసనను తీసివేస్తే ఇంక మనస్సు మిగలదు, అమనస్కస్థితి పొందుతావు, అప్పడు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మనకు సారా తాగే అలవాటు ఉంది అనుకోండి, అది తేలికగానే మానేయవచ్చు అయితే సారా తాగటం మానేద్దాము అనే బుద్ధి మనకు ఉండాలి. సారాతాగటం మానేద్దాము అనే బుద్ధి నాకు కలిగింది అనుకోండి సత్పురుషులు సహాయం చేస్తారు, భగవంతుడు సహాయం చేస్తాడు. ఆ బుద్ధి నీకు ఉంటే అన్ని సహాయాలు అందుతాయి. సారా మానాలి అనే బుద్ధి నాకు లేదు అనుకోండి ఎన్ని సహాయాలు చేసినా వాటి వలన ప్రయోజనం లేదు. వాసన విషయంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. మనలను పాడుచేసే వాసనలు వంద ఉన్నాయి అనుకోండి. 99 వాసనలు జయించి ఒక్క వాసన మిగిలిఉన్నా అది అనేక జన్మలను తీసుకొనివస్తుంది, దానినిబట్టి ఎంతజాగ్రత్తగా ఉండాలో మీరే చూసుకోండి. మనలను ఏ వాసనలు అయితే బంధిస్తున్నాయో అవి సజ్జనసాంగత్యం వలన పల్చబడిపోతాయి. సజ్జనులతో సహవాసం వలన మనం బాగుపడతాము, దుర్జనులతో సహవాసం వలన చెడిపోతాము.

చదివే పుస్తకాల విషయంలో, చేసే స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనం బాగుపడాలి అనే బుద్ధి లోపలనుండి రావాలి. జ్ఞానం పైనుండి పోసేది కాదు, లోపల నుండి ఊరాలి. బాగుపడాలి అనే బుద్ధి లోపలనుండి వస్తే మనం ఇచ్చిన అవకాశములను సద్విని యోగం చేసుకొంటాడు, ఆబుద్ధి లేనప్పుడు ఎన్ని అవకాశములు ఇచ్చినా ప్రయోజనం లేదు.

శాస్త్రంలో ఎన్ని మంచి విషయాలు ఉన్నా అవి గురువు ముఖతహ వినాలి. శాస్త్రాలలో ఉన్న సారాన్నే గురువు మనకు బోధిస్తాడు. ఈ పని నువ్వు చెయ్యి అని శాస్త్రంలో ఎంత నొక్కి చెప్పినా అది గురువు ముఖంలో నుండి వచ్చినప్పుడు మీకు దానిని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది, బాగుపడాలనే బుద్ధి కలుగుతుంది. గురువు యొక్క నాలుక హృదయంలో ఉంటుంది, గురువు యొక్క మాట నోటిలో నుండి రాదు, అది హృదయంలో నుండి వస్తుంది. అందుచేత గురువు ఒకమాట చెపుతూ ఉంటే నీకు ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. కొంతమంది గురువులు మాటలతో పని లేకుండానే మౌనంగానే నీ ఆధ్యాత్మికప్రగతికి సహకరిస్తారు. గురువు యొక్క సమక్షంలో మీ జీవితంలో ఎప్పుడూ అనుభవించని ప్రశాంతత మీకు అందుతుంది. మీ తల్లితండ్రుల ద్వారాగాని, స్నేహితులద్వారాగాని, బంధువుల ద్వారా గాని పొందలేని శాంతిని, సుఖాన్ని గురువుసమక్షంలో మీరు అనుభవించవచ్చు. భగవంతుడు ఉన్నాడా లేడా అని ఇటువంటి సందేహాలు ఏమైనా ఉంటే గురువు సమక్షంలో ఆ సందేహాలు అన్నీ పోతాయి. గురువు యొక్క దయ మీ హృదయంలో ప్రవేశించినప్పుడు అది సైలెంట్‌గానే జరిగిపోతుంది, మీ ప్రక్కన కూర్చొన్న వాడికి కూడా అది తెలియదు. ఈ మధ్య మేము పది మంది ఒకరి ఇంటి దగ్గర కూర్చున్నాము. వాళ్ళ అమ్మాయి బడికి వెళుతోంది. ఆ తల్లి మాకు ఎవరికి తెలియకుండా సైలెంట్‌గా కూతురికి తినమని మిఠాయి పెడుతోంది. అంటే కూతురు మీద ఉన్న ప్రేమ. తల్లి కూతురుకు పెట్టేది ఎంత కూల్‌గా జరిగిపోతుందో గురువు భక్తుడిని అనుగ్రహించేటప్పుడు అంతకంటే కూల్‌గా, క్వయిట్‌గా జరుగుతుంది. లోకంలో అన్ని ప్రేమల కంటే తల్లి ప్రేమ గొప్పది కాని ఓ అరుణాచలేశ్వరుడా! నీ ప్రేమతో పోల్చినప్పుడు కన్న తల్లి ప్రేమ కూడా ఒక ప్రేమ కాదు. అన్ని ప్రేమలకంటే నీ ప్రేమ ఉదాత్తమైనది. ఈశ్వరుడి ప్రేమ ట్యూబ్‌లైట్ అయితే తల్లి ప్రేమ కిరసనాయిల్ దీపం వంటిది. నీ ప్రేమముందు తల్లి ప్రేమ వెలవెలబోతుంది. తల్లి ప్రేమలో కోరికలు ఉండవచ్చు, ప్రకృతి వాసనలు ఉండవచ్చు, అక్కడ వ్యాపారం ఉంటుంది కాని ఈశ్వరుడి యొక్క ప్రేమలో కళంకం లేదు, అక్కడ వ్యాపారం ఏమీ కనబడదు. చేసైనా ఉండాలి, పెట్టైనా ఉండాలి అని సామెత ఉంది. పూర్వజన్మలో సత్కర్మ చేసి ఉండాలి, లేకపోతే పది మందికి అన్నం పెట్టి ఉండాలి. అలాచేసి ఉంటేనే ఈ జన్మలో సత్పురుషులతో సహవాసం

చేయాలనే బుద్ధి కలుగుతుంది. లేకపోతే మిమ్మల్ని మొట్టినా అసలు ఆ బుద్ధి రానేరాదు. బంతి జారటం మొదలు పెట్టాక అది ఎంత దూరం వెళ్ళిపడుతుందో చెప్పలేము. అలాగ మన బుద్ధి పాడయిపోయిన తరువాత మనం ఎంతవరకు చెడిపోతామో చెప్పలేము, అది అనేక నీచజన్మలకు కారణం అవుతుంది. వాల్మీకి డబ్బు కోసం చాలా మందిని చంపాడు. కాని ఒక మహర్షితో సహవాసం వలన ఆ కిరాతకుడు ఋషి అయి కూర్చున్నాడు. వాల్మీకి చెపుతాడు ఎంతకాలం అయితే ఆకాశం ఉంటుందో, ఎంతకాలం అయితే భూమి ఉంటుందో, ఎంతకాలం అయితే నదులు ప్రవహిస్తూ ఉంటాయో అంతకాలం నా కావ్యం అయిన రామాయణం బతికి ఉంటుంది అని చెప్పాడు, ఎంత ఆత్మవిశ్వాసమో చూడండి.

దేహానికి అతీతంగా, మనస్సుకు అతీతంగా, ఇంద్రియాలకు అతీతంగా, విషయబుద్ధికి అతీతంగా నీ హృదయంలో ఒక సత్యం ఉంది. దానికి చావులేదు, పుట్టుక లేదు, అది స్వతంత్ర్యమైనది. హృదయంలో ఏదో ఉందని ముందు నీకు తెలియాలి కదా, అప్పుడు దానిని పొందాలనే బుద్ధి కలుగుతుంది. నీ హృదయంలో ఒక నిజం ఉందని నీకు స్ఫురింపజేసే వాడు, దానిని పొందాలనే బుద్ధిని నీకు ప్రసాదించేవాడు గురువు. బాహ్యంగా వెయ్యి ఏనుగులను జయించిన వాడికంటే మనోనిగ్రహం సాధించినవాడు గొప్పవాడు. మాట విషయంలోగాని, చేత విషయంలోగాని తనని తాను ఎవడైతే అదుపులో పెట్టుకొంటున్నాడో వాడికి ఆత్మజ్ఞానం పొందటానికి అర్హత కలుగుతుంది. మీకు శాంతి లేదు అనుకోండి, సుఖం లేదు అనుకోండి, వెయ్యి కోట్లు డబ్బు ఉంది అనుకోండి, అప్పుడు ఏమనుకొంటారు అంటే మనకు శాంతిలేదు. రాత్రిళ్ళు నిద్ర పట్టటం లేదు ఈ డబ్బు ఏమి చేసుకొంటాము అని మీకు అనిపిస్తుంది. శాంతి యొక్క వైభవం అట్టిది. వినటం స్మరించుకోవటం, వినటం స్మరించుకోవటం, వినటం స్మరించుకోవటం దీనిని మనోయోగం అంటారు. చెవులతో వింటారు, ఎవరు వింటారు? మనస్సే వింటుంది. మరల స్మరించటం ఎవరు స్మరిస్తారు, మనస్సే స్మరిస్తుంది. ఈ మనోయోగం ద్వారా కూడా మీరు జ్ఞానం పొందవచ్చు. ఎవరైనా ఒక విషయం గురించి చెపుతున్నారు అనుకో. అది శాస్త్రానికి అనుకూలంగా ఉంటే దానిని స్వీకరించు, ఆ మాటలు శాస్త్రానికి విరుద్ధంగా ఉంటే వాటిని వదిలెయ్యి. పేచీలు పెట్టుకోవద్దు. మీరు అది చెయ్యండి, ఇది చెయ్యండి నాలుగురోజులలో మోక్షం వచ్చేస్తుంది అని చెప్పే పిచ్చోళ్ళు చాలా మంది ఉన్నారు. వాసనాక్షయం అవ్వకుండా నీకు మోక్షం ఎలా వస్తుంది. రాగద్వేషముల నుండి విడుదలపొందకుండా, బంధంలో నుండి విడుదలపొందకుండా నీకు మోక్షం ఏమిటి? గురువు అంటే కేవలం ఆ శరీరం అనుకోవద్దు. గురువు అంటే ఆత్మ. మన హృదయంలో అంతర్యామిగా ఏదయితే ఉందో వాడే గురువు. అందుచేత శరీరం మరణించిన గురువుతో సంబంధం

తెగదు. గురువు మాట్లాడుతూ ఉంటే అక్కడ మాట్లాడేది ఆత్మ. అవి లోపల రాగద్వేషాలు పెట్టుకొని మాట్లాడే మాటలు కాదు, రాగద్వేషములతో మాటలు చెప్పిన అవి నిలబడవు, కాల ప్రవాహంలో కొట్టుకొని పోతాయి. మనస్సుకు మూలం హృదయం. మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే అన్ని యోగాల ఫలితం వస్తుంది. ఇప్పుడు మన మెదడులో మనస్సు ఎంత సహజంగా ఉంటుందో, అంత సహజంగా మనస్సు హృదయంలో ఉండ గలిగితే మనోనాశనం అవుతుంది. మనస్సు నశిస్తే మనస్సులో ఉన్న వాసనలు అన్నీ కాలి బూడిద అవుతాయి. అయితే మనస్సు హృదయంలో నిలబడటానికి గురువు అనుగ్రహం అవసరం. మనస్సుతోటి, దేహంతోటి తాదాత్మ్యం తగ్గించుకోవాలి. హృదయంలో ఉన్న నిజాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి దేహాన్ని, మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఇప్పడు మనం కారులో భీమవరం వెళ్ళాలి అనుకోండి కారు భీమవరం కాదు, భీమవరం వెళ్ళటానికి కారు సహకరిస్తుంది. అలాగే నీ దేహం ఆత్మకాదు, ఆత్మానుభవం పొందటానికి నీ దేహం సహకరిస్తుంది కాబట్టి దానిని జాగ్రత్తగా చూసుకోవాలి. నువ్వుంటే అశాంతి, నువ్వుంటే దుఃఖం కాని నువ్వు లేకపోతే అశాంతి ఏమిటి? దుఃఖం ఏమిటి? అంటున్నారు భగవాన్. నువ్వు ఉన్నావు అనుకోవటం వలన అశాంతి వస్తోంది, నువ్వు లేవు అన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తే అశాంతి లేదు.

ఎవరైనా పొగిడితే మనకు సంతోషం వస్తుంది, ఎవరైనా విమర్శిస్తే మనకు దుఃఖం వస్తుంది ఎందుకు వస్తోంది అని గౌడపాదుడు అంటున్నాడు. ఈ పొగడ్తలు నిజంకాదు, విమర్శలు నిజంకాదు కాని ఇవి నిజం వలె మనకు కనిపిస్తున్నాయి కాబట్టి దుఃఖం వస్తోంది, అక్కడ నుండి అశాంతి ప్రారంభమవుతోంది, నరకం ఎక్కడో చూడనక్కరలేదు ఈ ఆకివీడు లోనే నువ్వు నరకాన్ని చూస్తున్నావు. నిజంకానిది నిజంవలె నీకు కనిపిస్తున్నంతకాలం నిన్ను దుఃఖ విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు. ఈ సృష్టి అంతా బ్రహ్మమే కాని బ్రహ్మం బ్రహ్మంలాగ నీకు కనబడటం లేదు, ప్రపంచంగా కనిపిస్తోంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు గోచరించటం లేదు, భిన్నంగా కనిపిస్తోంది, అక్కడ నుండి భయం ప్రారంభమవుతుంది. భిన్నదృష్టి ఉన్నప్పడు, భేదదృష్టి ఉన్నప్పడు పునర్జన్మలు వస్తాయి. ద్వైతంలో నుండి కోరిక పుడుతుంది, ద్వేషం పుడుతుంది, భయం పుడుతుంది. ఈ ద్వైతంలో నుండి విడుదల పొందితేకాని అద్వైతానుభవం కలుగదు.

మిమ్మల్ని ఏదైనా ఒక విషయంలో నేను నష్టపరిచాను అనుకోండి ఏదో జన్మలో మరల నేను మీచేత నష్టపడతాను. అది దేవుని చట్టం. చేసినప్పడు తెలియదు, అనుభవించినప్పడు తెలుస్తుంది అని ఒక సామెత ఉంది. మనం ఎవరినైనా ద్వేషిస్తున్నాము అనుకోండి అందులో ఉన్న బాధ మనకు తెలియదు. ఇతరులచేత మనం ద్వేషింపబడు తున్నప్పడు అందులో ఎంత

బాధ ఉందో అప్పుడు మనకు తెలుస్తుంది. ఇతరులకు మనం ఉపకారం చేస్తే అదే మనకు తిరిగివస్తుంది, ఇతరులకు అపకారం చేస్తే అదే మనకు తిరిగి వస్తుంది. మనం ఏది చేస్తే అదే మనకు తిరిగి వస్తుంది. మీరు మంచిపని చేసి కృష్ణార్పణం అంటే వెయ్యి రెట్లు వస్తుంది. ఒకవేళ మీరు ఏదైనా చెడ్డ చేసి ఆ చెడ్డను వదిలించుకోవటానికి కృష్ణార్పణం అంటే అదే వెయ్యి రెట్లు వచ్చి మీ మీద పడుతుంది. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. కృష్ణుడు భోజనం చేసి వచ్చి కూర్చొన్నాడు అనుకోండి అక్కడ ఉన్న పెద్దలు ఎవరైనా యివాళ భోజనం చేయనివారు ఎవరైనా ఉన్నారేమో చేతులు ఎత్తండి అంటే నిజంగా ఆహారం తీసుకోనివారు మౌనంగా ఉండేవారు, అప్పడే భోజనం చేసి వచ్చిన కృష్ణుడు చెయ్యి ఎత్తేవాడు. అంటే నేను తిన్నాను అనే భావన లేకుండా తింటే తినని వాడితో సమానము. మనం ఏదైనా పనిచేస్తే నేను చేసాను, నేను చేసాను అంటాము. నేను అనే తలంపు లేకుండా, నేను అనే భావన లేకుండా ఒక పని చేసినా వాడు చెయ్యనివాడితో సమానము.

గురువు యొక్క మౌనం శక్తివంతమైనది, అది మీ బుద్ధికి అందదు, అది అనుభవైకవేద్యం, అది మీ మనస్సును పవిత్రం చేస్తుంది. మన శరీరానికి రోగం వస్తే ఆసుపత్రికి వెళతాము. మన మనస్సును బాగుచేసుకోవటానికే ఈ సమావేశాలు, మన మనస్సును శుద్ధి చేసుకోవటానికే ఈ జ్ఞానయజ్ఞాలు. ఈ మాటలు శ్రద్ధగా వినటం వలన, వాటిని మననం చేసుకోవటం వలన మీ మనస్సు బాగుపడుతుంది. మీకు ఇహం, పరం కూడా కలిసివస్తాయి. మల్లెపూల చెట్టు దగ్గర కూర్చున్నారు అనుకోండి, మనకు ఇష్టం లేకపోయినా ఆ వాసన వస్తూ ఉంటుంది. మీరు మహర్షులు, మహాత్ముల దగ్గర కూర్చొన్నారు అనుకోండి, వారు మీతో మాట్లాడకపోయినా, మీ వంక చూడకపోయినా మీరు ఎంతోకొంత పవిత్రులు అవుతారు, ముముక్షత్వం కలుగుతుంది, అక్కడ మాటలతో పని లేదు దర్శనమే చాలు, ఆ వైభవం అట్టిది. మీరు పెద్ద పెద్ద సాధనలు చేయకపోయినా, మీరు చేయగలిగినది చేస్తున్నప్పటికీ మహనీయుల సమక్షంలో వాసనలు అణుగుతాయి, మనస్సు నిర్మలమవుతుంది, సమాధి స్థితిని మీకు ప్రసాదిస్తారు, ఇది అంతా సత్పురుషుల యొక్క భిక్ష. మీకు డబ్బు ఉంది అనుకోండి మీ అమ్మాయికి ఏమీలేదు అనుకోండి మా అమ్మాయి కూడా బాగుపడితే బాగుండును అని మీరు అనుకొంటారు. లౌకికప్రేమలోనే అలా అనుకొంటే ఇంక అలౌకిక ప్రేమ, అభౌతికప్రేమ ఎలా ఉంటుంది, అది మహాప్రవాహం. బుల్లి బుల్లి మనస్సులకే ఇలా అనిపిస్తూ ఉంటే ఇంక జ్ఞాని యొక్క హృదయం ఎలా స్పందిస్తుందో చూడండి. వారి సమక్షంలో నీ మనస్సు బాగుపడటమేకాదు, వారు ఏ స్థితిని పొందారో ఆ స్థితిని మీకు ప్రసాదిస్తాడు. వాడే జ్ఞాని, వాడే గురువు. ఇది మనోగతమైనది కాదు, దేహగతమైనది కాదు, ఈ సంబంధం హృదయగతమైనది. గురువు ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటాడో చూడండి. ఒకవేళ మీరు తప్పడు మార్గంలో వెళుతున్నారు అనుకో, మిమ్మల్ని

సవరిస్తాడు. మీరు భీమవరం వెళ్ళాలి అనుకొన్నారు అనుకోండి, కైకలూరు రోడ్డులో వెళ్ళి పోతున్నారు అనుకో, పోతేపోతున్నారు అనుకోడు, మీ దారికి అడ్డువస్తాడు. మరల ఆకివీడు తీసుకొని వస్తాడు, అక్కడ వదిలేయడు, భీమవరం రోడ్డు చూపించి మీ చేత నాలుగు అడుగులు వేయించి ప్రక్కకు తప్పకొంటాడు, వాడు గురువు. మీరు రాంగ్‌తింకింగ్‌లో ఉంటే అడ్డుపడతాడు, మనకెందుకు అని ఊరుకోడు. ఎందుచేతనంటే మీరు మార్గం తప్పిపోతారు. ఎవరి పిచ్చిలో వారు ఉండటం, ఇదే జ్ఞానం అనుకోవటం, అది జ్ఞానం కాదు పిచ్చి అని వాడికి తెలియటం లేదు. పైగా నేను ఏదో కనిపెట్టాను అంటాడు, పిచ్చోడు కనిపెట్టటం ఏమిటి? కృష్ణుడు అంతటి వాడు నేను ఏమీ కనిపెట్టి చెప్పటంలేదు, కొత్తగా చెప్పటంలేదు, వేదాలలో ఉన్న సారం చెపుతున్నాను అని చెపితే వీడు కనిపెట్టాను అంటాడు ఏమిటి? అది వాడి అహంకారానికి గుర్తు. రామకృష్ణుడు శరీరం విడిచి పెట్టిన తరువాత ఒకసారి వివేకానందుడు మహిమల గొడవలలో పడతాడు. అప్పుడు రామకృష్ణుడు స్వప్న దర్శనం ఇచ్చి ఇదా నీ దగ్గర నుండి నేను ఆశించినది. నీవు కష్టపడి కష్టపడి నీటిమీద నడవటం నేర్చుకొంటావు అనుకో, కష్టపడి అది నేర్చుకోవటం ఎందుకు? పది పైసలు ఇస్తే బల్లకట్టువాడు దాటిస్తాడు. కష్టపడి సాధన చేసేది నీటిమీద నడవటానికా? జ్ఞానం సంపాదించటానికా? అంటే శరీరం విడిచిపెట్టాక కూడా గైడెన్స్ విడిచిపెట్టటం లేదు. తను ఏస్థాయిని పొందాడో ఆస్థాయికి చేరుకొనేవరకు గురువు విడిచి పెట్టడు. ఈ లోపుగా ఆకర్షణలకు గురి అయినా, దారి తప్పినా రక్షించే భారం కూడా ఆయన నెత్తిమీద వేసుకొంటాడు, వాడు గురువు. మీకు తెలివి ఉండవచ్చు, డబ్బు ఉండవచ్చు, గౌరవాలు ఉండవచ్చు, వాటిని మీరు పాడుచేసుకోనక్కరలేదు. ఇవన్నీ ఉన్నప్పటికీ గురువు యొక్క అనుగ్రహం అవసరం, సత్పురుషులకు సేవచేయటం అవసరం. ఎండిపోయిన ఆకులు ఎటు గాలివీస్తే అటుపోతాయి, అలా మీ మనస్సు చలిస్తోంది అనుకోండి, మీ మనస్సును ఆ స్థితిలో ఉంచకుండా ఎదురుగాలికి కూడా నిలబడే శక్తిని ఇచ్చి, ఎదురు ప్రవాహానికి కూడా ఈదే శక్తిని ఇచ్చి, మనస్సును పవిత్రం చేసి, ఆత్మజ్ఞానం పొందటానికి తగిన అర్హతను కలుగజేస్తాడు, వాడు గురువు. అది మీకు తెలిసినా, తెలియకపోయినా, ఆ విషయం మీ బుద్ధికి అందినా అందకపోయినా ఇది అంతా గురువు అనుగ్రహం వలననే జరుగుతుంది. మీ రియాక్షన్‌తో సంబంధం లేకుండా ఆయన చేసే పని ఆయన చేసుకొంటూ పోతాడు, వాడే గురువు, వాడే సత్పురుషుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-09-06, గోడిపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహాభిమానం లేకుండా, స్వార్థబుద్ధి లేకుండా మనం ఏ పని చేసినా అది యజ్ఞంతో సమానము అని భగవంతుడు చెప్పాడు. మనం ఏ పని చేసినా యజ్ఞభావనతో చేయాలి. మన శరీరానికి ఏదైనా రోగం వస్తే ఆ రోగం తగ్గించుకోవటానికి హాస్పటల్‌కు వెళతాము.

మన ప్రవచనాలు అన్నీ జ్ఞానయజ్ఞాలు. మన మనస్సు సరిగా లేకపోతే, మన బుద్ధిలో వంకరలు ఉంటే సరిచేసుకోవటానికి ఈ జ్ఞానయజ్ఞాలు సహకరిస్తాయి అంటే ఇవి మన మనస్సును బాగు చేసుకోవటానికి పనికివచ్చే హాస్పటల్స్. మన శరీరం మన కూడా రాదు, శరీరం ఏదో రోజున చనిపోతుంది. మీకు అమృతానుభవం కలగాలంటే ఈ శరీరం భూమి మీద తిరుగాడుతుండగానే చనిపోవటం నేర్చుకోమని పెద్దలు చెపుతున్నారు. చనిపోవటం అంటే శరీరం చనిపోవటం కాదు, శరీరం ఉండగానే మీలో ఉన్న దేహాభిమానం నశించాలి, గుణాలు నశించాలి. చావు అనే దానిని మనం ఎంత ప్రయత్నం చేసినా తప్పించుకోలేము, అది ప్రకృతి ధర్మం. వచ్చేవారు వస్తూ ఉంటారు, పోయేవారు పోతూ ఉంటారు, ఇది అంతా ఒక ఆట, ఒక లీల. ఈ భూమి అనేది ఒక ట్రయినింగ్ గ్రౌండ్. మనం ఈ భూమి మీదకు వచ్చినందుకు ట్రయినింగ్ అయ్యి మనం పొందవలసింది ఏదో పొందాలి. సత్యం మన హృదయంలోనే ఉంది, అది మన మాటకు, మనస్సుకు అందదు, అది అనుభవైకవేద్యం. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేయాలి.

మనం ఎప్పుడూ ఎదుటి వారి క్షేమం కోరుకోవాలి. మనం నోటితో మంచి మాటలు మాట్లాడాలి, చేతితో మంచి పనులు చేయాలి. మీ శరీరం ఏదో రోజు మరణిస్తుంది కాని మీరు మాట్లాడిన మంచి మాటలు, చేసిన మంచి పనులు చాలా కాలం జీవించి ఉంటాయి అని బుద్ధుడు చెప్పాడు. అందుచేత మాటల విషయంలో, మనం చేసే పనుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మన మనస్సును బాగుచేసుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. ఎవరో వచ్చి బాగు చేస్తారని కనిపెట్టుకొని ఉండకూడదు. మన మనస్సును బాగుచేసుకోవటానికే సజ్జన సాంగత్యం, ఈ జ్ఞానయజ్ఞాలు అందుకే. ఈ పనులు మీరు చేయండి, ఈ పనులు మీరు చేయవద్దు అని భగవంతుడు స్పెసిఫిక్‌గా చెప్పాడు. నేను చెయ్యమని చెప్పిన పనులు చేస్తే మీరు సుఖపడతారు, నేను వద్దని చెప్పిన పనులు చేస్తే మీకు దుఃఖం వస్తుందని భగవంతుడు చెప్పాడు. మీకు ఎవరైనా ఏదైనా చెప్పిన వాటిని భగవంతుడి మాటలతో సరిచూసుకోండి, మీరు తూకం వేసుకోండి. భగవంతుడు చెప్పిన దానికి ఆ మాటలు విరుద్ధంగా ఉంటే వాటికి దూరంగా ఉండండి. కొంతమంది లోపల అహంకారం పెట్టుకొని అంతా బ్రహ్మమే, అంతా బ్రహ్మమే అని చెపుతూ ఉంటారు, బ్రహ్మం వాడికి అనుభవంలో లేదు అంటే వాడిని వాడు మోసం చేసుకోవటం. మీరు బ్రహ్మం గురించే కాకుండా లోకం గురించి, మంచి చెడ్డల గురించి ఇవన్నీ ఎందుకు చెపుతున్నారు అని రామకృష్ణుడిని అడిగారు. అదా మీరు అడిగేది, నేను ఒక్క బ్రహ్మం గురించే చెపుతాను అనుకోండి, లోకం యొక్క పోకడ గురించి, మంచి చెడ్డలను గురించి చెప్పను అనుకోండి, నేను తూకం తగ్గిపోతాను అన్నారు. నీ హృదయంలో

భగవంతుడు ఉన్నాడు అని చెప్పేసి, ఆయనను ఎలా పొందాలో చెప్పటం మానివేస్తే, ఆయనను పొందటానికి ఈ లోకాన్ని ఎలా ఉపయోగించుకోవాలో చెప్పటం మానివేస్తే నేను తూకం తగ్గిపోతాను అన్నారు. మీరు తూకం తగ్గిపోవటం ఏమిటి స్వామీ అని అడిగారు. అప్పడు ఆయన ఏమి చెప్పారు అంటే మామిడిపండు ఉంది అనుకోండి, తొక్కలు, పీచు, టెంక తినము, రసం ఒక్కటే తింటాము. మామిడి పండు తూకం వేసినప్పడు తొక్క, టెంక, పీచు అంతాకూడా తూకంలో ఉన్నాయి. వీటిని తీసేసి ఒక్క రసమే తూకం వేస్తే చాలా తక్కువ బరువు ఉంటుంది. తొక్క, టెంక, పీచు ఉంటేనే కదా రసం ఉండేది. అందుచేత నేను ప్రపంచం గురించి చెపుతున్నాను, దానిని ఎలా ఉపయోగించుకోవాలో చెపుతున్నాను. మేడపైకి వెళతాను, కిందకు వస్తాను. నేను మెట్లు ఎక్కి పైకి వెళ్ళిపోయాను, ఇంక కిందకు దిగను అంటే మీకు చెప్పటం ఎలా సాధ్యమవుతుంది. మీకు చెప్పాలి కదా, మీ కోసం కిందకు దిగటం కూడా నేర్చుకొన్నాను. కిందకు దిగి మీకు చెప్పి మరల పైకి వస్తున్నాను అని రామకృష్ణుడు చెప్పారు.

భగవద్గీత ఉంది అయితే మనం దానిని అధ్యయనం చెయ్యాలి కదా. ప్రపంచంలో భౌతికసంపద ఉంది, ఆధ్యాత్మికసంపద ఉంది. కాని భక్తి లేనివాడికి, ప్రేమ లేనివాడికి, శ్రద్ధ లేనివాడికి ఏమీ అందదు. మన మనస్సును బాగు చేసుకోవాలి. మనకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే భగవంతుడు మనకు అన్నీ ఇచ్చి మోక్షం కూడా ఇస్తాడు. కాని మనం అర్హత, యోగ్యత పట్టించుకోవాలి. మనలో ఏమైనా చెడ్డ గుణాలు ఉంటే ముందు వాటిని తొలగించుకోవాలి. తరువాత మంచి గుణాలను అలవర్చుకోవాలి. మంచి గుణాలు జ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూ ఉన్నా, విమర్శిస్తూ ఉన్నా రెండింటిని ఈశ్వరప్రసాదంగా తీసుకోండి. మీకు ఏదైనా మంచి జరుగుతూ ఉన్నా, చెడు జరుగుతూ ఉన్నా రెండింటిని ఈశ్వరప్రసాదంగా తీసుకోండి. వీటివలన మనస్సు కొంత ట్రెయినింగ్ అవ్వవలసి ఉంది. మీకు నిజంగా అమృతానుభవం కావాలా ఆరోజుకారోజు చనిపోవటం నేర్చుకోండి. మేము మంచి పనులు చేస్తున్నాము కాని ఎవరూ గుర్తించటం లేదు అని అంటారు. ఎవరూ గుర్తించటం లేదు అని ఎవరు అనుకొంటున్నారు, మీ మనస్సు అనుకొంటోంది, ఆ మనస్సును నెమ్మదిగా చంపటం నేర్చుకోవాలి. బహుజన్మల కృషివలన గాని నీ మనస్సు పవిత్రం అవ్వదు. బహు జన్మలలో సత్కర్మ చేస్తేగాని, ధ్యానం చేస్తేగాని నీ మనస్సుకు లోచూపు రాదు. మనస్సుకు లోచూపు వస్తేగాని లోపలఉన్న భగవంతుడు ఎరుకలోనికి రాడు. కష్టం, సుఖం ఏదీ కూడా భగవంతుడికి తెలియకుండా రాదు. ఒకోసారి బాగా డబ్బు ఇస్తాడు, ఒకోసారి దారిద్ర్యం ఇస్తాడు. ఒకోసారి కుర్చీలో కూర్చోబెడతాడు, ఒకోసారి నేలమీద కూర్చోబెడతాడు. ఇదంతా మన మీద ఇష్టం లేకకాదు. డబ్బు ఉన్నప్పడు మీ మనస్సు ఎలా

ఉంది, దారిద్ర్యంలో ఉన్నప్పుడు మీ మనస్సు ఎలా ఉంది అని మీ మానసికస్థితిని చూస్తూ ఉంటాడు. ఎప్పుడూ మీ మనస్సు సమానంగా ఉంటే, కష్టాన్ని కూడా సుఖంగా మార్చుకొనే మానసిక స్థాయి కనుక మీకు ఉంటే మీరు లోపల డిజర్వు అవుతారు, మీ మనస్సు ముగ్గుతుంది. మన మనస్సు ముగ్గితేనే భగవంతుడు స్వీకరిస్తాడు. స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం ఈ మూడుశరీరాలు శుద్ధి అవ్వటానికే జపధ్యానములు ఏర్పాటుచేసారు. భగవద్గీతను అధ్యయనం చెయ్యి, విష్ణుసహస్రనామాలు పారాయణం చేసుకో. భగవంతుడు రూపాన్ని ధ్యానం చేసుకో, సత్పురుషులతో సహవాసం చెయ్యి, నీకు ఏదైనా కలిగి ఉంటే అది ఇతరులకు పెట్టుకో. వీటివలన ఆత్మజ్ఞానం పొందటానికి నీకు అర్హత కలుగుతుంది. జపధ్యానముల వలన అవసరం లేని తలంపులు రావు, మనస్సుకు బాహ్యముఖానికి వెళ్ళే వేగం తగ్గిపోతుంది. అయితే మనం చేసేది ప్రీతిగా, ప్రేమగా, భక్తిగా ఉండాలి.

శాంతికోసం, సుఖంకోసం మనం బాహ్యంగా ఉన్న మనుషుల మీద గాని, వస్తువుల మీదగాని ఆధారపడితే అది చివరకు దుఃఖంగా మారిపోతుంది. మన హృదయంలో ఉన్న సుఖం, శాంతి మాత్రమే స్వతంత్రమైనవి. శరీరానికి రోగాలు వస్తాయి, మనస్సుకు సమస్యలు వస్తాయి. అయితే నీకు సమస్య ఎక్కడైతే వచ్చిందో అక్కడే పరిష్కారమార్గం కూడా ఉ ంటుంది. మీరు కొంత విచారణ చేసి చూస్తే మీకు వచ్చిన సమస్యకు పరిష్కార మార్గం మనస్సులోనే కనిపిస్తుంది. నీవు బాగుపడినా నీ మనస్సే కారణం, నీవు చెడిపోయినా నీ మనస్సే కారణం అని భగవంతుడు చెపుతున్నాడు. నీ మనస్సులో ఏమి జరుగుతోందో నువ్వు చూసుకోవటం లేదు. మనం పుట్టినది మొదలు చనిపోయే వరకు ముక్కులో గాలి తిరుగుతూ ఉంటుంది, గాలి లోపలకు వెళుతూ ఉంటుంది, బయటకు వస్తూ ఉంటుంది, మూడు అవస్థలలోను అలా జరుగుతూ ఉంటుంది. ఆ శ్వాస మీద మనస్సును నిలబెట్టి చూద్దాము అనే బుద్ధి మనకు రావటం లేదు, అలా శ్వాసను గమనిస్తూ ఉన్నా మనోనిగ్రహం కలుగుతుంది. ఎట్టి పరిస్థితులలోను మనస్సును పాడు చేసుకోవద్దు, శాంతచిత్తం అవసరం, మనస్సు శాంతిగా ఉంటే, నిర్మలంగా ఉంటే మనం ఏదైనా సాధించగలము. స్మరణ కూడా ఒక యోగమే. భగవంతుడిని నిరంతరం స్మరించటం వలన మనం పవిత్రులమవుతాము, బుద్ధి శుద్ధి అవుతుంది. ఎవడి బుద్ధి అయితే శుద్ధి అయ్యిందో వాడు సిద్ధపురుషుడు అవుతాడు. మీరు ఏపని చేసినా అది సాధన అనుకొని చెయ్యండి. మనం ఒక మాట మాట్లాడినా, ఒక పని చేసినా, మనకు ఒక ఆలోచన వచ్చినా అది మనకు సాధనకు సహకరించేలాగ ఉండాలి, వాటి వలన సాధనాబలం పెరగాలి. సాధన లేనివాడికి సిద్ధి లేదు. మీరు ఏదైనా పని చేస్తే ఎవరికైనా సహాయం చేస్తే అది సేవ అనుకొని చెయ్యవద్దు, అది పూజ అనుకొని చెయ్యండి, అలా చేయటం వలన అది

యోగం అవుతుంది, మనస్సు బ్రహ్మాకారం చెందటానికి అది సహకరిస్తుంది.

మనకు కోరికలు వస్తూ ఉంటాయి, భయం వస్తూ ఉంటుంది. ఇవన్నీ ఎవరికి వస్తున్నాయి, ఇవన్నీ దేహగతమైన నేనుకే వస్తున్నాయి. మాకు అశాంతిగా ఉంది, మాకు బెంగగా ఉంది అంటారు, వీటి అన్నింటికి కారణం భయం. నువ్వు హరినామ స్మరణ చేస్తూ ఉంటే, నారాయణుడిని స్మరిస్తూ ఉంటే నీకు భయం ఏల? ఈశ్వరుడు ఉన్నాడు అనే విశ్వాసం నీకు ఉంటే నీకు భయం ఎందుకు? హరి అంటే హరించేవాడు, నీ సంసార భయాన్ని హరించేవాడే హరి, వాడు నీ కూడా ఉంటే ఇంక నీకు భయం ఎందుకు? భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసం మనకు లేకపోవటం వలన భయం వస్తోంది. మనకు పరిస్థితులు బాగా ఉన్నా అదీ స్వప్నమే, పరిస్థితులు బాగా లేకపోయినా అదీ స్వప్నమే. ఇవన్నీ పాఠాలు నేర్పటానికే మనకు వస్తున్నాయి. వాటి ద్వారా పాఠాలు నేర్చుకోండి. ఈశ్వరుడికి తెలియకుండా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి వీలు లేదు. ఒకోసారి నీకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతాయి, నీ మనస్సును ఆయన వైపుకు త్రిప్పటానికే ఆ సంఘటనలను క్రియేట్ చేస్తాడు, వాటి ద్వారా నీకు పాఠాలు నేర్పుతాడు. ప్రపంచం కూడా ఒక అద్దం లాంటిది అని భగవాన్ చెప్పారు. అద్దంలో చూసి మీ మొఖాన్ని ఎలా సరిచేసుకొంటారో అలాగ ప్రపంచాన్ని చూసి మీ మనస్సును సరిచూసుకోండి అని భగవాన్ చెప్పారు. సోక్రటీస్ మహాజ్ఞాని, బాహ్యంగా చూడటానికి ఏమీ బాగుండడు. ఆయన ఇంట్లో కూర్చొని మొఖాన్ని అద్దంలో చూసుకొంటున్నాడు. ఒక భక్తుడు వచ్చి మీ మొఖాన్ని అద్దంలో చూసుకొంటున్నారు ఏమిటి? అని అడిగాడు. మరి నేను ఏమీ బాగాలేను కదా, నా బాగోలేనితనాన్ని అద్దంలో చూసుకొంటున్నాను. అలా ఎందుకు చూసుకొంటున్నానో చెప్పమంటావా! సోక్రటీసు బాగోడు అని అందరూ అంటున్నారు కదా! ఎంత బాగాలేదో అద్దంలో చూసుకొంటున్నాను. అది కవర్ చేసుకోవటానికి ఎన్ని మంచి పనులు చేయాలి, ఎన్ని మంచి మాటలు మాట్లాడాలి, అది బేలెన్స్ చేసుకోవటానికి ఇంకా ఎన్ని విషయాలు ఎచీవ్ చెయ్యాలని చూసుకొంటున్నాను వయ్యా అన్నాడు సోక్రటీసు. ఆ భక్తుడు గట్టికారి, మీరు అందంగా లేరు కాబట్టి కవర్ చేసుకోవటానికి మంచి పనులు చేస్తున్నాను అంటున్నారు, మీరు నిజంగా అందంగా ఉంటే మంచి పనులు చేయటం మానివేస్తారా? అని అడిగాడు. అలాకాదువయ్యా! నేను చాలా అందంగా ఉన్నాను అనుకో, అప్పుడు ఆ అందం కాపాడుకోవటానికి మంచి పనులు చేస్తాను. ఒకవేళ నేను అందంగా ఉన్నాను అని మంచి పనులు చేయటం మానివేస్తే మరల విమర్శలు వస్తాయి. అందుచేత అందంగా లేకపోతే దానిని కవర్ చేయటానికి చేస్తాను, అందంగా ఉంటే దానిని కాపాడుకోవటానికి చేస్తాను, మంచి పనులు చేయటం మాత్రం మానను అని చెప్పాడు. వాడు సోక్రటీసు.

ధనం, గౌరవం, చదువు సంపాదించటం కంటే సహృదయం సంపాదించటం చాలా కష్టం. ఎన్నో జన్మలు కృషి చేస్తేనే కాని సహృదయం, సద్బుద్ధి రాదు. ఇంటిని బంగారం చేసుకోవటంకంటే మనస్సును బంగారం చేసుకోవటం కష్టం. మనకు ఈశ్వరుడు పట్ల సజీవమైన విశ్వాసం ఉండాలి. మంచి మంచి కోసమే చేయాలి, ఏదో ప్రయోజనం ఆశించి చేయకూడదు. మంచి మంచి కోసమే చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. ఇష్టాలు, అయిష్టాలు నిగ్రహించుకొని అందులోని నిస్సారతను తెలుసుకొంటేగాని లోతులు పెరగవు, హృదయం యొక్క లోయలలోనికి దిగలేవు. భగవంతుడు మనకు మంచి పనులు చేసే అవకాశం ఇస్తే మనం చేయగలమా, మన వల్ల ఏదీ అవ్వదు ఆయన చేయిస్తే మనం చేయగలము. కాని మనం ఏదో చేసాము అని మన అహంకారం అనిపిస్తుంది. మన ప్రయత్నం లేకుండా మనం గాలి పీల్చుకొంటున్నాము, విడిచిపెడుతున్నాము. జపం అలా జరగాలి. జపధ్యానములు సహజమైతే మనోచాపల్యం తగ్గిపోతుంది, బుద్ధి శుద్ధి అవుతుంది, హృదయంలో ఉన్న వస్తువు ఎరుకలోనికి వస్తుంది. ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. తిండి అంటే నోటితో తినేదేకాదు, చెవులతో వినేది కూడా ఆహారమే. చెడ్డ మాటలు వింటూ ఉంటే నీ బుద్ధి నెమ్మదిగా పాడైపోతుంది. కళ్ళతో చూసేది కూడా ఆహారమే. అందుచేత కళ్ళతోటి మంచి దృశ్యాలు చూడాలి. నోటితో తినే ఆహారం దేహానికి ఎలా ఉపయోగపడుతుందో అలాగ మీరు చెవులతో వినే మంచి మాటలు, కంటితో చూసే మంచి దృశ్యాలు అవి మానసికఆరోగ్యానికి సహకరిస్తాయి.

భగవంతుడి పట్ల నీకు ఉన్న ప్రేమ లోతుగా ఉంటే ఆ రోజుకారోజు అసత్యానికి దూరమయిపోతూ ఉంటావు. ఈ శరీరాన్ని నీకు ఏ తల్లి అయితే ఇచ్చిందో ఆ తల్లిని హాస్పటల్‌కు తీసుకొని వెళితే నా తల్లిని ఉద్ధరిస్తున్నాను అని చెపుతుంది, ఆ తల్లి ఇచ్చిన ఈ శరీరానికి రోగం వచ్చి హాస్పటల్‌కు వెళితే ఎవరినీ ఉద్దరించాను అనుకోదు. వాళ్ళ అమ్మను తీసుకొని వెళితే ఉద్ధరించాను అంటుంది తల్లి కూతుళ్ళ మధ్యే ఇంత భిన్నభావన ఉంది అంటే మాయ ఎంత బలీయంగా ఉందో మనకు తెలుస్తుంది. ఈ వేరుభావనలోనే మాయ అంతా ఉంది. వేరుభావన ఎక్కడ నుండి వస్తోంది? వేరుభావన చైతన్యంలోనుండి రావటం లేదు, మనస్సులో నుండే వస్తోంది. ఈ మనస్సే బంధం. ఈ మనస్సు అనే గెడప దాటామా చైతన్యంలో పడిపోతాము. ఈ మనస్సే మనలను పాడుచేస్తోంది అన్న సంగతి కూడా మనకు తెలియటంలేదు, అది తెలియ జెప్పటానికే అవతారపురుషులు వస్తున్నారు. సాధ్యమయినంత వరకు ఇతరుల గొడవలలోనికి వెళ్ళవద్దు. మీ పని ఏదో మీరు చేసుకోండి. లోకంతో అతిగా ఉండవద్దు. లోకంతో అతిగా ఉంటే, ఇతరులతో అతిగా ఉంటే మనకు తెలియకుండా అహంభావన పెరిగి పోతుంది. పరమాత్మను విడిచిపెట్టి మనం ఎంత దూరం అయితే వెళ్ళిపోయామో మరల అనేక జన్మలు

కష్టపడితేనేగాని మనం అంతదూరం వెనక్కి రాలేము. నీ హృదయంలో ఉన్న పరమాత్మను తెలుసుకోవటానికి నీకు ఎవరో అడ్డురావటం లేదు, నీ బలహీనతలే అడ్డువస్తున్నాయి. నీబలహీనతల నుండి బయటకు వచ్చినప్పడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. సమానబుద్ధిని అలవర్చుకొంటే హృదయంలో సమానంగా ఉన్న వస్తువు మనకు ఎరుకలోనికి వస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-09-06, మోగం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తి అంటే సామాన్యమైన విషయం కాదు. విద్య సంపాదించటం కంటే, ధనం సంపాదించటం కంటే, అధికారం సంపాదించటం కంటే భక్తి సంపాదించటం కష్టం. పూర్వ జన్మలలో సజ్జన సాంగత్యం చేసి ఉంటేగాని, సత్కర్మ చేసి ఉంటేగాని ఈ జన్మలో భక్తి కలుగదు. మనం నిద్రపోతున్నాము అనుకోండి, స్వప్నంలో పులి వచ్చి మీద పడింది అనుకోండి, మనకు భయం వేసి వెంటనే మెలుకువ వచ్చేస్తుంది. భక్తి కూడా పులిలాంటిదే, అజ్ఞానం అనే నిద్రలో నుండి మనలను మేల్కొలిపే పులి లాంటిది. మనకు డబ్బు విలువ తెలుస్తోంది, చదువు విలువ తెలుస్తోంది, అధికారం విలువ తెలుస్తోంది కాని భక్తి విలువ మనకు తెలియటం లేదు. ఎందుకు తెలియటం లేదు అంటే దానికి సంబంధించిన యోగ్యత మనకు లేదు, మనకు సద్గ్రంధ పఠనం లేదు, సజ్జనసాంగత్యం లేదు, సాధన లేదు, స్మరణ లేదు. సాధన లేకుండా మనకు సిద్ధి ఎలా కలుగుతుంది. ముందు కష్టపడినవారు తరువాత సుఖపడతారు అని చెపుతూ ఉంటారు. మనం సాధన ప్రారంభించేటప్పడు ఎంతోకొంత కష్టం అనుభవించ వచ్చు కాని ఆ కష్టాన్ని భరిస్తే తరువాత శాశ్వతమైన శాంతి అనుభవంలోనికి వస్తుంది. మీకు ఎంత తెలివి ఉన్నా శాంతి మీ మనస్సుకు, బుద్ధికి అందదు కాని మీ అనుభవానికి అందుతుంది. ఆ శాంతి స్థానం ఎవడికయితే దొరికిందో వాడు సంసారదుఃఖంలో నుండి బయటకు వచ్చేస్తాడు. కొంతమంది శివస్మరణ చేసి, నారాయణస్మరణ చేసి సంసారదుఃఖంలో నుండి బయటకు వచ్చినవారు ఉన్నారు. దుఃఖంలేని స్థితి నిర్వాణము అని బుద్ధుడు చెప్పాడు. మనవారు సెపరేట్‌గా చెప్పారు. గాఢనిద్రలో కూడా దుఃఖం లేదు అది మోక్షం అని ఎలా చెపుతాము, జాగ్రదవస్థలో మనం ఎరుకలో ఉండగా శాంతిని, ఆనందాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవాలి, అది మోక్షం అని మనవారు చెప్పారు.

సాధకులు ఆహారం విషయంలో, వ్యవహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి, అతిగా ఉండకూడదు. ఆహారం అతిగా తింటే తమోగుణం, తక్కువ తింటే నీరసం అందుచేత సమానంగా ఉండాలి, ఆకలిని బట్టి తినాలి కాని రుచిని బట్టి తినకూడదు. ఆత్మజ్ఞానం పొందటానికి ఆహారం విషయంలో, విహారం విషయంలో ఆచారము అవసరం. ఆచారము,

ఆరాధన ఇవి రెండూ కూడా మన మనస్సును శుద్ధి చేస్తాయి. మన బుద్ధిలో దోషాలు ఎక్కువగా ఉన్నాయి మనకు జ్ఞానం రాదేమో అని అలా అనుకోకూడదు. నెగిటివ్ సైడ్ మరిచిపోయి మనం చేయవలసిన కృషి చేస్తూ ఉంటే గమ్యానికి వచ్చేస్తాము. నిద్ర కూడా తగుమాత్రంగా ఉండాలి. అతిగా నిద్రపోతే మనకు పనిచేసుకొనే టైము సరిపోదు, తక్కువగా నిద్రపోతే మనస్సుకు రెస్టు సరిపోదు. మనం నిద్రపోయినప్పుడు మనస్సు మనకు తెలియకుండా తన పుట్టిల్లు అయిన హృదయం లోనికి జారిపోతుంది. సాధన చేసి జాగ్రదవస్థలో ఎరుకతో మనస్సును హృదయంలోనికి పంపగలిగితే అమృతానుభవం కలుగుతుంది. భగవాన్ అరుణాచలేశ్వరుడితో నా ఇంట్లో నేను ఉన్నాను, నన్ను బయటకు లాగి, రోడ్డు మీద విడిచిపెట్టలేదు, నీ ఇంటికి తీసుకొని పోయావు. భగవంతుడి ఇల్లు అంటే చైతన్యం, అంటే చైతన్యంలో ఐక్యం చేసేసావు. అంటే నన్ను నాకు కాకుండా చేసేసావు అరుణాచలేశ్వరుడా అన్నారు. మాటల దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి. సర్వసాధారణంగా అందరూ ఏమి చేస్తారు అంటే ముందు మాట్లాడతారు, తరువాత ఆలోచిస్తారు. అలా కాదు ముందు ఆలోచించి తరువాత మాట్లాడాలి. మన మాట, పని, ఆలోచన సాత్వికంగా ఉండాలి. మనం పని చేస్తూ ఉండాలి మనం కనబడకూడదు, అలా చేస్తూ ఉంటే ఆత్మజ్ఞానానికి అర్హత కలుగుతుంది. మన పద్ధతి ఎలా ఉంది అంటే పని సున్నా, మనిషి కనబడుతూ ఉండాలి. పెళ్లిళ్ల దగ్గర కొంతమంది ఎలా ఉంటారు అంటే ఏ పని చెయ్యరు, యజమానికి కనబడేలా తిరుగుతూ ఉంటారు. అంటే మనం బాగా పని చేస్తున్నాము అని యజమాని అనుకోవాలి, మనలో ఎంత కపటం ఉందో చూడండి.

ఏ బలహీనత వలన, ఏ వాసన వలన మన మనస్సు బాహ్యముఖమవుతోందో చూసుకొని ఆ బలహీనతలో నుండి తప్పించమని ఈశ్వరుడిని హృదయపూర్వకంగా ప్రార్థిస్తే ఆయన సహాయ సహకారములు అందిస్తాడు, ఆ బలహీనతలలో నుండి మనం బయటపడవచ్చు. నేను అనేది మనం నీళ్ల కంటే ఎక్కువగా వాడతాము, ఎంతసేపు ఆ నేనుతోనే కలిసి ఉంటాము. నా నేనును నాకు కాకుండా చేసావు అరుణాచలేశ్వరుడా అంటారు భగవాన్. అంటే నీ అనుగ్రహం అనే పులి ఏమి చేసింది అంటే ఏ నేనును అయితే తొలగించాలని జన్మల తరబడి సాధన చేస్తున్నామో, ఆ నేనును నాకు తెలియకుండా తొలగించావు. ఆ పని ఎవరు చేయగలరు తల్లి చేయగలదా? తండ్రి చేయగలడా? బంధువులు చేయగలరా? వారు ధనం కావాలి అంటే ఇవ్వగలరు కాని ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించలేరు. వారే చీకటిలో ఉంటే మనలను చీకటిలో నుండి ఎలా బయటకు తీసుకొని రాగలరు వారు. గుడ్డివారు అయితే మనకు దారి ఎలా చూపించగలరు. అజ్ఞానం అనే చీకటిలో నుండి, మనస్సు అనే బంధంలో నుండి విడుదల చేయగలవాడు ఒక్క గురువు మాత్రమే. బుద్ధుడు శరీరం విడిచిపెట్టే రోజున

ఆయన సవతి తమ్ముడు ఆనంద్ దుఃఖ పడుతూ ఉంటాడు. బుద్ధుడు ఆనంద్‌తో జన్మించటం, మరణించటం అనేవి సహజమైన విషయాలు. ఏదైనా అసహజమైన విషయం జరిగితే దుఃఖపడవచ్చు, సహజంగా జరిగే దానికి దుఃఖపడవలసిన పని లేదు అని చెప్పాడు. నిజం కానిదానితో మనం తాదాత్మ్యం పొందుతున్నాము. నిజంకానిదానిలో నుండి విడుదల పొందితేనే గాని నిజం మనకు అనుభవం లోనికి రాదు, నిజం అనుభవంలోనికి వస్తేనేగాని నీకు శాంతి లేదు, సుఖం లేదు, స్వేచ్ఛ లేదు. గొర్రెపిల్లను చంకన పెట్టుకొని నా గొర్రెపిల్ల పోయింది అని గొల్లవాడు తిరుగుతూ ఉంటాడు, ఇప్పుడు మన పరిస్థితి కూడా అలాగే ఉంది. హృదయంలో అంతర్యామిగా నారాయణుడిని పెట్టుకొని ఆయన కోసం బయట వెతుకుచూ ఎక్కడ ఎక్కడో తిరుగుతున్నాము. ఈశ్వరుడు అనే వాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం ముందు మనకు ఉంటే మనస్సు యొక్క చాపల్యం 50% ఆగిపోతుంది.

దేహవాసన, లోకవాసన మనిషిని పీడించేస్తాయి. మనస్సుకు లోచూపు కలగకుండా చేసేవి ఈ రెండు వాసనలే, మన అశాంతికి ఇవి రెండే కారణం. ఓ అరుణాచలేశ్వరుడా! నీ వైభవమును చూపించి, నీ దయ నాపట్ల చూపించి, నీ ఔన్నత్యాన్ని చూపిస్తే నా మనస్సు దేహవాసనలో నుండి, లోకవాసనలో నుండి విడిపోయి నీ యందు అణిగిపోతుంది, అణిగిన మనస్సుకు కాని ఆత్మజ్ఞానం కలుగదు. మిమ్మల్ని అశాంతి పీడిస్తోంది అనుకోండి. మీరు గురువు సమక్షంలో ఉన్నప్పుడు సంవత్సరాల తరబడి మిమ్మల్ని పీడించే అశాంతి మిమ్మల్ని విడిచి వెళ్ళిపోతుంది, అది గురువు యొక్క వైభవం. మనం గురువును పట్టుకోవటం వేరు, ఆయన మనలను పట్టుకోవటం వేరు. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ ఈ మూడు అవస్థలు అసత్యమే. ఈ మూడు అసత్యమే అనే అనుభవం గురువుకు ఉంటుంది. గురువు సమక్షంలో మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా ఈ మూడు అవస్థలను దాటిస్తాడు, అప్పుడు మీ మనస్సు తాత్కాలికంగా అయినా శాంతిసాగరంలో ఐక్యమవుతుంది. మనకు మూడు అవస్థలు తెలుసు, ఈ మూడు అవస్థలకు ఆధారంగా ఉన్న తురీయస్థితి, ఆ నాలుగో అవస్థ మనకు తెలియదు. ఆ నాలుగో అవస్థలో గురువు ఉంటాడు. ఈ మూడు అవస్థలను సడన్‌గా దాటించేటప్పటికి ఆ నాలుగో అవస్థ యొక్క శాంతి మీకు అందుతుంది, అది గురువుకే సాధ్యం. ఇటువంటి శాంతి మాకు అనుభవంలోనికి వచ్చింది అని చెప్పటానికి అందని శాంతి గురువు సమక్షంలో వస్తుంది. దేహవాసనచుట్టూ, లోకవాసన చుట్టూ నేను తిరుగుతున్నాను. లోకం నన్ను పట్టుకోక పోయినా నేను లోకాన్ని పట్టుకొంటున్నాను. దేహం నన్ను పట్టుకోవటం లేదు, దేహాన్ని నేనే పట్టుకొంటున్నాను. నన్ను పట్టుకోండి అని దేహం చెపుతోందా, అది ఏమీ చెప్పటం లేదు. మనమే వాటిని పట్టుకొంటున్నాము. స్వామీజీ ఒక మీటింగులో మాట్లాడుతున్నారు. అక్కడ కూర్చున్న వాడు

లేచి మీరు నాలుగు రోజుల నుండి ఇక్కడ మాట్లాడుతున్నారు. మీ ప్రవచనాలకు రావాలని ఉందిగాని ఇంట్లో గొడవలు ఉంటాయి కదా అందుచేత రాలేక పోతున్నాము అన్నాడు. మేము గృహస్థులం, మేము గృహస్థులం, మాకు తీరుబడి ఎక్కడ ఉంది అని మీరందరు అంటున్నారు. మీ ఇల్లు మిమ్మల్ని పట్టుకొందా, మీరు వెళ్ళి ఇల్లును పట్టుకొంటున్నారా? మీరు ఇల్లును పట్టుకొంటున్నారు కాని ఇల్లు మిమ్మల్ని పట్టుకోవటం లేదు. ఇల్లును పట్టుకొన్నా, లోకాన్ని పట్టుకొన్నా, దేహాన్ని పట్టుకొన్నా మీరే వాటిని పట్టుకొని, అవి మిమ్మల్ని పట్టుకొన్నాయి అని తిరగేసి చెపుతున్నారు. పరమహంసగారు దక్షిణేశ్వరంలో ఒక గదిలో కూర్చొని బోధించారు, మీరు ప్రపంచం అంతా తిరుగుతున్నారు ఏమిటి? ఆయన లాగే మీరూ ఉండవచ్చు కదా అని ఒకరు స్వామీజీని అడిగారు. నాలాగ ఆయన ఉండ కూడదు, ఆయనలాగ నేను ఉండకూడదు, ఎవరి పాత్ర వారిదే అని చెప్పారు. భారత యుద్ధంలో అర్జునుడు కృష్ణుడితో వీరినందరినీ ఎలా చంపటం అంటాడు. అప్పుడు కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే వీరందరిని నేను చంపే ఉంచాను, నువ్వు చేతులు ఆడించు, అర్జునుడు బాగా యుద్ధం చేసాడు అని చెప్పకొంటారు. ఇప్పుడు మనం చేసే సాధనలు కూడా చేతులు ఆడించటంలాంటివి. మనచేత సాధన చేయించేవాడు, స్మరణ చేయించేవాడు, మనలను గమ్యానికి తీసుకొనిపోయేవాడు భగవంతుడే.

ఇప్పుడు మనం సభ జరుపుకొంటున్నాము అనుకోండి. ఎవడి వాసనను బట్టి వారు వెళ్ళిపోతారు. వారికి ఏదైనా అధికారం సంపాదించాలని ఉంది అనుకోండి, ఇక్కడ కూర్చొన్నా వాడి మనస్సు అధికారం మీదకు పోతుంది, వాడు లెగిసి వెళ్ళిపోతాడు. కొత్త సినిమా వచ్చింది అనుకోండి. సినిమా ఇష్టం ఉన్నవారు మ్యాట్నీ టైము అయిపోయింది అని వారు లెగిసి వెళ్ళి పోతారు. ఎవడి వాసనను బట్టి వాడు వెళ్ళిపోతాడు, ఇదీ లోకం. ఇంక ఈశ్వరుడు ఎవరికి కావాలి? ఎవడో ఆయన అనుగ్రహించిన వాడికి మాత్రమే ఇది సాధ్యం. అదే ఉపనిషత్‌లలో చెపుతారు. మాకు ఈశ్వరుడు తెలియాలి, మాకు ఈశ్వరుడు తెలియాలి అంటే ఆయన తెలియబడడు. ఆయన ఎవడికి తెలియబడాలి అనుకొంటాడో వాడికి మాత్రమే ఆయన తెలియ బడతాడు. మనుషులందరూ మేము మంచి వారము అనుకొంటున్నారు, మనం మంచివారము అని ఆయన అనుకోవాలి కదా, ఆయన అనుకొంటే కదా నీకు జ్ఞానం ప్రసాదించేది. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన లేకపోతే మరొక వాసన ఇలా ఏదో ఒక వాసనతో కొట్టుకొనిపోతున్నాము అందుచేత నీ అనుగ్రహం చూపించి ఈ మనస్సును స్వాధీనం చేసుకొని, మనస్సు అణిగేటట్లు చేయవలసిన బాధ్యత నీదే అరుణాచలేశ్వరుడా అంటున్నారు. క్షేత్రం అంటే శరీరం, క్షేత్రజ్ఞుడు అంటే జీవుడు. ఈ రెండింటికి అతీతంగా ఉన్న నన్ను తెలుసుకో కర్మ బంధంల నుండి, జననమరణ ప్రవాహం నుండి విడుదలపొందుతావు అని భగవంతుడు చెప్పాడు. జ్ఞాని ఈ రెండింటికి

అతీతంగా ఉంటాడు. దేహము నేను అని కొంతమంది అనుకొంటున్నారు, మనస్సు నేను అని కొంతమంది అనుకొంటున్నారు, తెలివి నేను అని కొంతమంది అనుకొంటున్నారు. ఏదైతే నేను కాదో అది నేను అనుకొనే బుద్ధిలో నుండి బయటపడటానికి నీ దయ తప్పించి నాకు ఇంకో మార్గం లేదు. అసత్యంలో నుండి సత్యంలోనికి రావటానికి, చీకటిలో నుండి వెలుతురు లోనికి రావటానికి నీ అనుగ్రహం తప్పించి నాకు ఇంకో మార్గం లేదు, మార్గం నువ్వే, సాధన నువ్వే, గమ్యం కూడా నువ్వే అరుణాచలేశ్వరుడా. సాధన చేసి నిన్ను పొందటానికి నీకంటే వేరుగా నేను ఉంటే కదా. ఓ అరుణాచలేశ్వరుడా! నీకు వేరుబుద్ధి లేదు, నీవు జ్ఞాన సూర్యుడవు. అజ్ఞానంలో నుండి ఇప్పడే ఇక్కడే నన్ను విడుదల చెయ్యి. ఈ ప్రక్రియలో నీలో ఆ దోషాలు ఉన్నాయి, ఈ బలహీనతలు ఉన్నాయి అని చెప్పవద్దు. నీలో ఆరోగం ఉంది, ఈ రోగం ఉంది అని పంపిస్తే వాడు డాక్టరు ఎలా అవుతాడు, రోగం తగ్గించాలి కదా. అలాగే నాలోని బలహీనతలను చూపించి పంపేస్తే నీవు గురువు ఎలా అవుతావు, దేవుడివి ఎలా అవుతావు. నీ దయ చూపించి నాలోని దోషములను సమూలంగా నాశనం చేసి నీలో ఐక్యం చేసుకో.

భ్రాంతి ఎప్పడు కలుగుతుందో చెప్పలేము, గమ్యానికి చేరుకొనేవరకు బహుజాగ్రత్తగా ఉండాలి. బంగారపులేడిని చూసి భ్రాంతిపడి నానా కష్టాలు పడింది సీతమ్మ. బంగారపులేడి ఉండదని కూడా ఆమెకు తట్టలేదు. అందుచేత మన బుద్ధి ఎప్పడు జారిపోతుందో చెప్పలేము. సీతమ్మను చూసి భ్రాంతిపడి రావణాసురుడు ఏకంగా ప్రాణాలు పోగొట్టుకొన్నాడు, ఇవన్నీ మనకు పాఠాలు. ఈ సీతమ్మ గొడవ నీకు ఎందుకు అని చాలామంది రావణాసురుడికి చెప్పారు అయినా వాడు వినలేదు. రావణాసురుడే కాదు భ్రాంతి ఉంటే, దురాశ ఉంటే మన పని కూడా అంతే. రామకృష్ణ పరమహంసగారు ఒకసారి మంచంమీద కూర్చొని ఉన్నారు, మంచం మీద వేసిన బట్ట బాగా మాసిపోయి ఉంది. ఒక ధనవంతుడు అక్కడికి వచ్చాడు. ఏమండీ స్వామీ మిమ్మల్ని చూడటానికి చాలామంది వస్తున్నారు. ఈ బట్ట చాలా మాసిపోయి ఉంది. దానిని శుభ్రం చేయించుకొనే శక్తి లేదా. మీకు పదివేల రూపాయలు బ్యాంక్‌లో వేస్తాను, బట్టలను శుభ్రం చేయటం, గదిని శుభ్రం చేయటానికి ఒకరిని పురమాయిస్తాను, ఎవరైనా వస్తే కూర్చోవటానికి అది ఏర్పాట్లు చేస్తాను అని చెప్పాడు. ఏమయ్యా నువ్వు ఈ మాటలు అనటం దుడ్డు కర్రతో కొట్టినట్లుగా ఉంది అన్నారు రామకృష్ణుడు. ఇదేమిటి స్వామి! మీ చేతికి డబ్బులు ఇవ్వటం లేదు, బ్యాంక్‌లో వేస్తాను అని చెప్పాను, ఇక్కడ అన్నీ పురమాయిస్తాను అని చెప్పాను కదా అన్నాడు. నువ్వు బ్యాంక్‌లో వేస్తావు అనుకో, నాకు బ్యాంక్‌లో డబ్బు ఉందనిపిస్తుంది కదా, అది చాలు నేను పతనమవ్వటానికి అని చెప్పారు. ఈ మాత్రం దానికే పతనమయిపోతారా అని అడిగాడు. నువ్వు అనుకొన్నంత గొప్పస్థితిలో నేను లేను, అక్కడ నాకు పదివేలు ఉన్నాయి అనే

తలంపు ఉంటుంది కదా, అది చాలు అమృతానుభవం కలుగకుండా అడ్డురావటానికి, అందుచేత నన్ను ఇలా ఉండనియ్యి అని రామకృష్ణుడు చెప్పారు. వసిష్ఠుడు అంతటివారు జ్ఞానం పొందాక కూడా సంసారంలో ఉన్నారు కదా అని అడిగాడు. వసిష్ఠుడు ఏదో తిన్నాడు, వ్యాసుడు ఏదో తిన్నాడు అంటే వారిని తిననియ్యి, నాకు ఉన్నది నేను తింటాను, వారి విషయం సరే, నా పద్ధతిలో నన్ను ఉండనియ్యి అన్నాడు. అప్పుడు కూడా ఆయన మోహపడలేదు, వాడు రామకృష్ణుడు. పెద్దల దగ్గరకు వెళ్ళేటప్పుడు రిక్తహస్తాలతో వెళ్ళకూడదు అని చెపుతారు, మా దగ్గర పైసాలు లేవు, వట్టిచేతులతో వచ్చాము అని ఎవరైనా భగవాన్‌తో అంటే ఏమీ తేలేదు అంటారు ఏమిటి? నేనును తెచ్చారు కదా. నేను లేకుండా ఎవడు ఉంటాడు, ఆ నేనును తెచ్చారు కదా, నాకు కావలసింది అదే, నాకు కావలసిన ఆహారం తెచ్చారు. ఆ నేనును తొలగించటమే, ఈ భూమి మీదకు వచ్చిన పని అదే.

భగవాన్ అరుణాచలేశ్వరుడితో ఏమన్నారు అంటే వాసనలు, సంస్కారాలు, యిష్టాలు, అయిష్టాలు, బలహీనతలు, జన్మలు, గొప్పలు, తిప్పలు అన్నీ ఏ నేను అనే తలంపు మీద ఆధారపడి ఉన్నాయో ఆ నేనును నువ్వు తీసేస్తే నాకు మిగిలేది శాంతి, మిగిలేది మోక్షం. నా నేనును తినమని అడుగుతున్నాను, నీకు పొట్టనిండుతుంది, నాకు శాంతి కలుగుతుంది. దారిద్ర్యాన్ని అనుభవించవచ్చు, అగౌరవాన్ని అనుభవించవచ్చు, కాని దేహాభిమానం పెట్టే పీడ అనుభవించటం చాలా కష్టం. ఆ పీడను తీసెయ్యి అరుణాచలేశ్వరుడా! దేహాన్ని ముస్తాబు చేయటం వలన పెద్ద ప్రమాదం ఏమీ లేదు, దేహము నేను అనే తలంపును ముస్తాబు చేయకూడదు. దేహానికి ఆహారం పెట్టవచ్చు కాని దేహము నేను అనే తలంపుకు ఆహారం పెట్టవద్దు. మిమ్మల్ని ఎవరైనా పొగిడారు అనుకోండి, ఇది బాగానే ఉంది అని మీకు సంతోషం వస్తే ఆ పొగడ్త మీ మనస్సును ముట్టుకొంది. ఎవరైనా విమర్శించినప్పుడు మీకు దుఃఖం వస్తే ఆ విమర్శ మీ మనస్సును ముట్టుకొంది. పుణ్యం, పాపం, రాగం, ద్వేషం అన్నీ మనస్సును ముట్టుకొంటాయి. కాని చైతన్యాన్ని ఏదీ ముట్టుకోదు మీరు చైతన్యస్థాయికి ఎదిగారు అనుకోండి ఇంక ఏదీ మిమ్మల్ని ముట్టుకోదు. మనస్సు అనే గడప దాటారా ఇంక ఏదీ మిమ్మల్ని ముట్టుకోదు. అప్పుడు పరమశాంతి కలుగుతుంది, అటువంటి శాంతి స్థానంలోనికి నన్ను మేల్కొలుపు అరుణాచలేశ్వరుడా అంటున్నారు. మీరు ఇంటికి వెళ్ళాక ఈ ముట్టుకోవటాలు జరుగుతున్నాయో లేదో చూసుకోండి. మీరు రోడ్డు మీద వెళుతున్నారు అనుకోండి, మీకు బాగా తెలిసినవారు మొఖం ఒక ప్రక్కకు పెట్టుకొని వెళ్ళిపోతున్నారు అనుకోండి, ఏమిటి మాట్లాడకుండా వెళ్ళిపోతున్నారు అని మీకు లోపల అనిపిస్తుంది అంటే మీరు అవుట్, మీకు పునర్జన్మలు వచ్చేస్తాయి. కోపం ఎలా ఉంటుందో తెలియని వాడవు

నీవు. ఒకవేళ నేను ఏదైనా పొరపాట్లు చేసాను అనుకో, నీకు కోపం ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి నన్ను క్షమించి, ఆశీర్వదించి, నీ హృదయంలో నాకు కొంత చోటు ఇవ్వు అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. యివన్నీ మనం ఎందుకు శ్రవణం చేయాలి అంటే శ్రవణం చేయటం వలన వాటి విలువ మనకు తెలుస్తుంది. సబ్జక్టు శ్రవణం చేయకపోతే లోపల ఉన్న వస్తువు యొక్క విలువ మనకు తెలియదు. ఆ వస్తువు యొక్క విలువ మనకు తెలియకపోతే, దానిని పొందటానికి ప్రయత్నం చేయలేము, ఇంక అది మన సొంతం అవ్వదు. నీ హృదయంలో నేను ఉన్నాను, నీ మనస్సును రవ్వంత లోపలకు తిప్పి అన్వేషించు, అది జ్ఞానయోగం. నాకు ఇష్టమైన పనులు చెయ్యి. నీ ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టి ఏ రకంగా పనిచేస్తే నా అనుగ్రహానికి పాత్రుడవు అవుతావో ఆ రకంగా పనిచెయ్యి, అది కర్మయోగం. నా నామాన్ని స్మరించుకో, నా రూపాన్ని ధ్యానం చేసుకో అది భక్తియోగం. అన్ని యోగాలు భగవంతుడు చెప్పాడు. మనం భోజనం చేస్తున్నాము అనుకోండి ముద్ద నోట్లో పెట్టుకొనే వరకూ పక్కవారితో వాగుతూ ఉంటాము, ముద్ద నోట్లో పెట్టుకొన్నాక ఇంకపడి ఉంటాము. నోట్లో ఉన్న ముద్ద ఇంక మాట్లాడనివ్వదు. నోరు వాగటం మానదు, మన మనస్సు తిరగటం మానదు. నీ హృదయంలో ఉన్న శాంతి సముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచుతూ ఉంటే మనస్సు తిరగటం ఆగిపోతుంది. ఇంక అప్పుడు శాంతే శాంతి, ఆనందమే ఆనందం.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-10-06, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృతయుగంలో మహావిష్ణువును ధ్యానం చేయటం వలన, త్రేతాయుగంలో యజ్ఞ యాగాలు చేయటం వలన, ద్వాపరయుగంలో అర్చనలు, పూజలు చేయటంవలన, కలియుగంలో నామసంకీర్తన వలన జీవుడు తరిస్తాడు అని చెప్పారు. అయితే నామ సంకీర్తన మనం భక్తిగా, ప్రేమగా, ఇష్టంగా చేయాలి. మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకోండి. మన మనో దేహములకు అతీతంగా, ఈ సృష్టికి అతీతంగా మన హృదయంలో అంతర్యామిగా ఒక సత్యవస్తువు ఉంది అని అన్ని మతాలు చెపుతున్నాయి. దానినే హిందువులు నారాయణుడు అంటున్నారు, క్రైస్తవులు యెహోవా అంటున్నారు, ముస్లిములు అల్లా అంటున్నారు. ఎవరు ఏ పేరు పెట్టి పిలిచినా వస్తువు ఒక్కటే. ఆ వస్తువును తెలుసుకోవటానికి అనేక మతాలు అనేక మార్గాలు చెప్పాయి కాని అన్ని మతాలు చెప్పింది ఒకే వస్తువు గురించి, అది మర్చిపోకండి. మీరందరు ఈ ప్రవచనాలకు ఎందుకు వస్తున్నారు. కాలక్షేపానికి వస్తున్నారా, మీరందరు ఓట్లు వేసి మమ్మల్ని గెలిపించాలా, గౌరవాల కోసమా ఏమీ కాదు. మనిషికి ధనం ఉన్నా, అధికారం ఉన్నా, విద్య ఉన్నా ఎన్ని ఉన్నా వాడిని దుఃఖం విడిచిపెట్టటం లేదు. మీరు

ఏకులస్థులయినా, ఏ మతస్థులయినా మిమ్మల్ని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్లటమే ఈ ప్రవచనాల యొక్క ప్రయోజనం. ఆనంద సాగరం మన హృదయంలో ఉంది. చల్లని నీటిలో మన చేయి పెడితే ఆ చల్లదనం మన స్పర్శకు ఎలా తెలుస్తుందో అలాగ హృదయంలో ఉన్న ఆనందం మన సహస్రారానికి అందాలి. అది అందేవరకు దుఃఖం నశించదు, అశాంతి నశించదు. అహంకారం ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అని భగవాన్ చిన్న వాక్యం చెప్పారు. దానిని జాగ్రత్తగా విడదీసి చూసుకోండి. ఈ మాట మీకు అర్థమయితే మీ దుఃఖం వెంటనే ఆరిపోతుంది, ఇంక మీకు పునర్జన్మలు లేవు. భగవాన్ పది మాటలలో చెప్పేది ఒక మాటలో చెపుతారు. మనిషి నిండుగా, గంభీరంగా ఉంటారు. అవసరంలేని మాట ఒక్కమాట మాట్లాడరు, అవసరమైన మాట విడిచిపెట్టరు, ఆయన రమణమహర్షి. వాసుదేవస్వామి ఏమి చెప్పారు అంటే అహంకారమే చావు, అహంకారమే పుట్టుక, అహంకారమే కామం, అహంకారమే ఆశ అంటే అహంకారమే ఇన్ని రూపాలలో మారుతోంది. అహంకారం ఉన్నంతకాలం ఏదో రూపంలో ఆశ మిమ్మల్ని విడిచి పెట్టదు, మిమ్మల్ని పట్టుకొని పీడించేస్తుంది. ఏదోలాగ అణుచుకొందామన్నా గెంటుకొని గెంటుకొని వచ్చేస్తుంది. ఈ అహంకారం నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంలాగ కనిపింప చేస్తుంది, దీనినే అధ్యాస అంటారు. అహంకారాన్ని వ్యక్తిగతంగా చెప్పినప్పుడు అవిద్య, అజ్ఞానం అంటారు, అందరి అహంకారాలను సమిష్టిగా కలిపి చెప్పినప్పుడు మాయ అంటారు.

యోగం అంటే కలయిక. ఇప్పుడు మనకు దేహంతోటి, మనస్సుతోటి అనుసంధానం ఎలా ఉందో, అలాగ లోపల ఉన్న పరమాత్మతో అనుసంధానం చేసేదే యోగం. అహంకారం నశించాలంటే మనం ధర్మాన్ని ఆచరించాలి. ధర్మం అంటే దానం కాదు, ఒక జీవిత విధానం. ధర్మాన్ని ఆచరించకుండా మనం ఎన్ని కోతిగంతులు వేసినా అజ్ఞానం నశించదు. అసలు నీవు శాంతిగా ఎందుకు ఉండలేకపోతున్నావు, దుఃఖం ఎందుకు వస్తోంది అంటే అధ్యాసలో నుండి దుఃఖం వస్తోంది. నీకు తాడు పాముగా కనిపిస్తోంది అనుకో, నిజంగా అక్కడ పాము లేదు, తాడు పాముగా కనిపిస్తోంది, అప్పుడు నీకు భయం వేస్తుంది, అది కరిచేస్తుంది మనం చనిపోతాము అనిపిస్తుంది. నీకు తాడు పాముగా కనిపిస్తున్నంతకాలం ఎన్ని ప్రాణాయామాలు చేసినా, యోగాభ్యాసాలు చేసిన నిన్ను భయం విడిచిపెట్టదు. నీకు ఉన్నది ఉన్నట్లుగా కనిపించే వరకు లేనిది ఉన్నట్లుగా కనిపిస్తుంది, అది ఎవరూ ఆపుచేయలేరు. బయటముడి అయితే విప్పకోవటానికి ఎవరైనా సహాయం చేస్తారు ఇది లోపల ఉన్న ముడి. స్వప్రయత్నం, కాల పరిపక్వం, ఈశ్వరకటాక్షం లేకపోతే లోపల ఉన్న ముడిని విప్పలేవు. నీ తెలివితేటల వలన ఆ ముడిని విప్పకోలేవు. ధర్మాన్ని ఆచరిస్తే, వ్యక్తిభావన లేకుండా ఈశ్వర

ప్రీత్యర్థం నీవు పనిచేస్తూ ఉంటే, ఆయన కోసమే జీవిస్తూ ఉంటే ఆయనే ఆ ముడిని విప్పిపెట్టి, మనం విప్పుకొన్నామన్న భావన కలుగజేస్తాడు, ఆయన భగవంతుడు. మీరు ఎవరైనా 10 కోట్లు సంపాదించారు అనుకోండి, పదికోట్లు నేను సంపాదించాను అని అనుకొంటారు. మీకు కలిసివచ్చేటట్లు ఉపాయం చేసినవాడు ఈశ్వరుడు. కాని మీరు ఏమనుకొంటున్నారు నా తెలివి వలన సంపాదించాను అనుకొంటున్నారు. అజ్ఞానం అంతా అక్కడే ఉంది. ఇచ్చింది ఈశ్వరుడు. అది ఈశ్వరుడు ఇచ్చాడు అనే గుర్తింపు మనకు రావాలి. మనకంటే తెలివైన వారు చాలామంది ఉన్నారు, మరి వారికి ఎందుకు డబ్బు కలిసి రావటం లేదు.

ఉన్నది ఒకటి, మీకు కనిపించేది ఇంకొకటి. ఇదే అధ్యాస. అజ్ఞానంలోనుండి అధ్యాస వస్తుంది, అధ్యాసలో నుండి దుఃఖం వస్తుంది. గాఢనిద్రలో, స్వప్నంలో, జాగ్రదవస్థలో మూడు అవస్థలలోను అజ్ఞానం ఉంది. ఈ మూడు అవస్థలు అబద్ధమే, ఈ అవస్థలు అన్నీ అహంకారానికే. జాగ్రదవస్థ, స్వప్నావస్థలలో మీకు దుఃఖం వస్తోంది. గాఢనిద్రలో సుఖం మీకు తెలియకపోయిన అక్కడ దుఃఖం లేదు. అజ్ఞానం మూడు అవస్థలలో ఉంది కదా మరి గాఢనిద్రలో దుఃఖం ఎందుకు రావటంలేదు. జాగ్రదవస్థ స్వప్నం రెండింటిలో అధ్యాస ఉంది. గాఢనిద్రలో నీకు అధ్యాస లేదు కాబట్టి అక్కడ దుఃఖం లేదు. గాఢనిద్రలో ఒక వస్తువు ఇంకో వస్తువుగా నీకు కనబడటం లేదు. జాగ్రదవస్థ వచ్చేటప్పటికి అధ్యాస వస్తోంది, సత్యం అసత్యంగా నీకు కనబడుతోంది, అందుచేత దుఃఖం వస్తోంది. సత్యం ఏమిటో నీకు అర్థమయ్యేవరకు కోటి జన్మలు ఎత్తినా సత్యం అసత్యంగా కనిపించటం మానదు. మనకు రోగం తగ్గనప్పడు ఎన్ని హాస్పటల్స్‌కు తిరిగినా ఒకటే అలాగే మనకు అజ్ఞానం తగ్గనప్పడు మనం ఏమతంలో ఉన్నా, ఏ దేవుడిని ఆరాధించినా ఒక్కటే. ఆధ్యాత్మికమార్గంలో మనం ముందుకు వెళ్ళలేకపోవటానికి కారణం మనకు ఆత్మ విశ్వాసం లేదు. ఆరు, నాలుగు కలిపితే పది, దారినపోయే వాడు వచ్చి ఆరు, నాలుగు కలిపితే పది కాదు, పదకొండు అంటే నిజమే అనుకొంటాము, ఇంక మీరు దేనికి పనికిరారు. మీకు లెక్కలు తెలియకపోవటం వలన, మీమీద మీకు విశ్వాసం లేకపోవటం వలన అలా తయారయ్యారు. దారిని పోయేవాడు చెప్పింది కాదు, శాస్త్రంలో ఏదైతే ఉందో దానిని హృదయపూర్వకంగా చెయ్యి, చేసేది చేసి వదిలెయ్యి. మన దగ్గర తింగరతనం ఎక్కడ ఉంది అంటే మనం మంచి పనిచేసాము, అందరూ చెప్పకొంటున్నారా లేదా అని చూస్తాము. నీవు మంచిపని చేసి వదిలెయ్యి, దానికి చిలవలు, పలవలు అల్లుకొని నీ బుద్ధిని పాడుచేసుకోవద్దు. లెక్కలు బాగా వచ్చినవాడు అయితే ఆరు నాలుగు పదకొండు అని చెపితే నవ్వుకొని ఊరుకొంటాడు కాని వాడిని పట్టించుకోడు. మనకు ఉన్న శాంతి నిజమైతే, మనకు ఉన్న జ్ఞానం నిజమైతే సమాజం

మనలను ఏమీ చేయలేదు, సమాజం యొక్క ప్రభావం మన మీద పడదు, జ్ఞాని ఒక్కడు మాత్రమే స్వతంత్రుడు. నిప్ప కాల్చకుండా ఉండలేదు అలాగే జ్ఞాని ప్రేమించకుండా ఉండలేడు. వాడు అలా చెప్పాడు, వీడు ఇలా చెప్పాడు అంటే నీకు జ్ఞానం లేక వారు చెప్పిన మాటలు, వీరు చెప్పిన మాటలు బుర్రలో వేసుకొని శుభ్రంగా పాడైపోయి, చనిపోయే రోజు వచ్చేసరికి కుళ్ళిపోయి చివరకు నరకానికి వెళ్ళటం. మనం చేసేది ఏమిటి అంటే బతికి ఉన్నంత కాలం నరకానికి మెట్లు కట్టుకొంటున్నాము.

కొంతమందికి పొగడ్తలు, గౌరవాలు అంటే ఇష్టం. వేశ్య యొక్క వలలో పడినవాడు ఎప్పడైనా బయటకు వస్తాడు గాని ఈ పొగడ్తలు, సన్మానాలకు అలవాటు పడినవాడు అందులోనుండి బయటకు రాలేడు అని పరమాత్మ చెప్పాడు. మీరు ఎవరినైనా తిట్టండి వాడు పైకి ఏమీ అనకపోయినా లోపల దుఃఖపడతాడు, ఆ దుఃఖపడేవాడు దొంగ. వాడిలో నుండి బయటకురా అంతవరకు నిన్ను దుఃఖం విడిచి పెట్టదు. నిర్వాణసుఖం, మోక్షం పొందాలంటే ఈ సృష్టిలో ఎలా బతకాలో మహమ్మద్ ప్రవక్త చెప్పారు. మనం దారి వెంట నడిచి వెళుతూ ఉంటే ఆ ప్రక్కన, ఈ ప్రక్కన ముళ్ళకంపలు ఉన్నాయి అనుకోండి. అవి మన బట్టకు, శరీరానికి గుచ్చుకోకుండా ఎంతో జాగ్రత్తగా వెళతాము. అలాగే ఈ లోకంలో రాగద్వేషాలు, అసూయ, లాభనష్టాలు ఇలాగ ఎంతో పెంట ఉంది. ఆ ముళ్ళకంపలు గుచ్చుకోకుండా ఎంత జాగ్రత్తగా బయటకు వస్తున్నావో అంత జాగ్రత్తగా ఈ పెంట ఏమీ నిన్ను అంటుకోకుండా ఈ లోకంలోనుండి బయటకురా, అప్పడు కదా నీవు స్వర్గరాజ్యాన్ని పొందేది అన్నాడు. రాగద్వేషాలు వచ్చిన తరువాత పోగొట్టుకోవటం తరువాత విషయం, అసలు ఎందుకు వస్తున్నాయి, అధ్యాస వలన వస్తున్నాయి అంటే సత్యంకానిదానిని సత్యం అనుకోవటం వలన వస్తున్నాయి. చెడ్డవారు సుఖంగా బతుకుతున్నారు, మంచి వారికి ఎక్కువగా కష్టాలు వస్తున్నాయి అని అడుగుతున్నారు. మనకు కష్టాలు వస్తున్నాయి అనుకోండి, అవి ఈశ్వరుడికి తెలియకుండా రావటం లేదు. చావులు, పుట్టుకలు, సంపద, అధికారం ఉండటం లేకపోవటం, దారిద్ర్యం ఇది అంతా మాయ. నా పాదాలను ఆశ్రయించకుండా నా మాయలో నుండి ఎవరూ బయటకు రాలేరు అని పరమాత్మ చెప్పాడు. భగవంతుడు నీమీద ఇష్టం లేక కష్టాలు పంపుతున్నాడా, నీ మీద ఇష్టం లేకకాదు, మంచివారిని తొందరగా తరింపచేయాలని అనుకొంటున్నాడు. బంగారాన్ని కాలిస్తేనేగాని పరిశుద్ధం అవ్వదు. మీ మనస్సును మెరిసేటట్లు చేయటానికే కష్టాలు పంపుతున్నాడు. మనం మంచివారమే కాని మన బుద్ధి ఇంకా పక్వానికి రాలేదు. మనం చేదుగా, పుల్లగా ఉన్నాము. ఆ పుల్లదనాన్ని, చేదుతనాన్ని తీసేసి తేనె ఎంత తియ్యగా ఉంటుందో అంత తీయగా చేయటానికి కష్టాలు పంపుతున్నాడు. అది తెలిసిన వారు ధన్యులు.

నీ సంసారం కూడా అహంకారమే. సంసారం అంటే ఆవరణ, అది ఒకదొడ్డి, ఒకనుయ్యి. ఆ గోతిలో నుండి నీ తెలివితేటల వలన బయటకు రాలేవు, నీ అహంకారానికి అంతప్రజ్ఞ ఉందా, నా అనుగ్రహం లేకుండా ఆ గోతిలో నుండి బయటకు రాలేవు, కోటి జన్మలు ఎత్తినా అందులోనుండి బయటకు వచ్చే సమస్య లేదు అంటున్నాడు పరమాత్మ. శాస్త్రాన్ని వదిలేసి, రోడ్డునపోయే వాడి మాటల ప్రభావం నీ బుర్ర మీద పడుతూ ఉంటే నీవు మూర్ఖుడవు అని ఇంక వేరే చెప్పనక్కరలేదు. మనం గుడికి వెళ్ళి ఏది అడగాలో తెలియక అది కావాలి, ఇది కావాలి అని అడుగుతాము. నీ దయ ప్రసాదించు, నీదయ లేకుండా ఈ మాయలోనుండి బయటకు రాలేను అని అడిగేవారు ఎంత మంది ఉన్నారు. ఆయన అనుగ్రహం ఉంటే ఈకష్టాల నుండి, బాధల నుండి బయటకు వస్తాము, మోక్షం కూడా పొందుతాము. ఈశ్వరుడి పాదాల మీద భక్తి కలగటం మీరు అనుకొన్నంత తేలిక కాదు. మనకు పూర్వ పుణ్యం లేకపోతే, ఎంతోకొంత కృషిలేకపోతే మనకు భక్తి కలుగదు. ఆయన కృప లేకుండా కృషి రాదు, కృషి లేకపోతే భక్తిరాదు.

మన కులమతాలతో, మనకున్న ఆస్తులతో, రాగద్వేషములతో ఇప్పడు మనకు ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ లోపల ఉన్న నారాయణుడితో, హృదయంలో ఉన్న సత్యవస్తువుతో తాదాత్మ్యం వస్తే, దానికి సంబంధించిన ఎరుకనీకు కలిగితే అది జ్ఞానం. అక్కడ టీచర్ వాడి శిష్యుడికి బోధిస్తూ రెచ్చిపోయి, ఆనందాన్ని కక్కుతూ చెపుతాడు. లోపల ఉన్న వస్తువు యొక్క ఎరుక నీకు కలిగిందా ఇంక పునర్జన్మ లేదు, బంధం లేదు, అక్కడ దుఃఖ స్పర్శ లేదు. యోగా చేస్తూ ఉంటే బిపి, షుగర్ తగ్గవచ్చు, అందుకా నీవు యోగాభ్యాసం చేసేది. మన దగ్గర ధాన్యం కొని ఆడిస్తాడు. ఆడించినప్పడు చిట్టు, తవుడు వస్తాయి. చిట్టు తవుడుకోసం వాడు ధాన్యం కొనటంలేదు, బియ్యంకోసం కొనుక్కొంటాడు. అదేవిధంగా మనం యోగాభ్యాసం చేసినా, ధర్మాన్ని ఆచరించినా కేవలం భగవంతుని దయకోసం, మోక్షం పొందటం కోసమే. ఈ లోపుగా మీకు ధనం రావచ్చు, గౌరవాలు రావచ్చు, రోగాలు తగ్గవచ్చు ఇవన్నీ అప్రధానమైన విషయాలు. ఈ మధ్య అమెరికాలో ఒక పెద్ద ధనవంతుడిని విలేఖరి ఒక ప్రశ్న అడిగాడు. మీకు వచ్చిన ఆదాయంలో నూటికి 50 పైసలు ఉంచుకొని మిగతా 50 పైసలు ప్రజలకోసం ఖర్చు చేస్తున్నారు, మీకు డబ్బు అంటే ఇష్టం లేదా అని అడిగాడు. నాకు డబ్బు అంటే ఇష్టం లేకకాదు, ఎవరినో ఉద్ధరించాలి అని నేను పంచిపెట్టటంలేదు, డబ్బును అలా ఖర్చు చేయటం వలన నాకు శాంతి, ఆనందం కలుగుతోంది. మనిషికి కావలసింది డబ్బు కాదు, శాంతి, ఆనందం కావాలి. డబ్బును సద్వినియోగం చేయటంలో నాకు శాంతి ఆనందం కలుగుతున్నాయి అని చెప్పాడు. గీతను అధ్యయనం చెయ్యి, విష్ణుసహస్రనామాలను పారాయణం చేసుకో, సత్పురుషులతో సహవాసం చెయ్యి, నీకు కలిగి ఉంటే సమాజంతో పంచుకో అని ఆచార్యులవారు చెప్పారు. మీకు ఉన్న

దంతా మీరే తినేయటం కాదు, కొంత సమాజంతో పంచుకోండి. సమాజానికి చేసేది ప్రేమతో, ఇష్టంతో చేయండి. నీకు గాఢనిద్రలో దుఃఖం లేదు, సుఖం నీకు తెలియటం లేదు. నీకు మోక్షం వచ్చినప్పుడు దుఃఖం ఉండదు, అక్కడితో ఆగిపోదు సుఖం, శాంతి తెలుస్తూ ఉంటుంది, అదే మోక్షం. దేహగతమైన నేను, మనోగతమైన నేను అక్కడ ఉండదు కాని నీవు ఉంటావు, ఎలా ఉంటావు అంటే ఆనందంలో, శాంతిలో ఊగిసలాడతావు. ప్రారబ్ధం ఎవరికి అని భగవాన్‌ను అడుగుతున్నారు. ప్రారబ్ధం అనుభవించేది దొంగ నేను, సత్యానికి వీటితో సంబంధం లేదు. ఇప్పుడు స్వప్న శరీరానికి కురుపులు వేసాయి అనుకో, చీముకారిపోతోంది అనుకో, మెలుకువ వచ్చాక ఆ దేహానికి వేసిన కురుపులు అబద్ధం అని నీకు తెలుస్తుంది. అలాగే నీకు జ్ఞానం కలిగాక ఇప్పుడు ఈ దేహం అనుభవించే ప్రారబ్ధం అంతా అబద్ధం, ఇది దొంగ ప్రారబ్ధం అని నీకు తెలుస్తుంది. మిధ్యానేను ఎంత నిజమో ఈ ప్రారబ్ధం కూడా అంతే నిజం. స్వప్నం జరుగుతున్నంతసేపు ఆ స్వప్నం నిజం అనిపిస్తుంది, మెలుకువ వచ్చాక అది నిజంకాదు అని మనకు తెలుస్తుంది. అలాగే జ్ఞానం కలిగాక ఈ దేహం, లోకం, అహంకారం ఇవన్నీ నిజం కాదు అని నీకు తెలుస్తుంది.

మనందరకు డబ్బు లేకపోయిన ఒక శవం ఉంది కదా, ఆ శవాన్ని వేసుకొని తిరుగుతున్నాము, ఆ శవబుద్ధిని ఊడగొట్టటానికే నీకు కష్టాలు పంపుతున్నాడు కాని నీ మీద ఇష్టం లేకకాదు. ఏదో రూపంతోటి, ఏదో నామంతోటి తాదాత్మ్యం పొందినప్పుడు నీకు ప్రారబ్ధం కాని ఆపేరు, ఆ రూపం నీవు కాదని తెలిసినప్పుడు నీకు ప్రారబ్ధం ఏమిటి? నీ లోపల ఉన్న చైతన్యానికి ప్రారబ్ధం ఏమిటి? పుట్టిన దానికి ప్రారబ్ధం గాని, పుట్టనిదానికి ప్రారబ్ధం ఏమిటి? ఇక్కడే సమస్య పరిష్కారం అయిపోతుంది. తప్పు ఒప్పుల మధ్య, స్వర్గ నరకాల మధ్య నిన్ను తిప్పటానికి భగవాన్ రాలేదు. ఎక్కడ తప్పు ఒప్పులు లేవో, ఎక్కడ పుణ్య పాపాలు లేవో, ఎక్కడ స్వర్గ నరకాలు లేవో అక్కడికి నిన్ను తీసుకొనిపోవటానికే రమణభగవాన్ చెపుతున్నారు. జనాన్ని, భక్తులను పోగుచేసు కోవటానికి ఆయన ఇక్కడకు రాలేదు. నీ దుఃఖాన్ని ఆర్పటానికి వచ్చాడు. నీవు ఏ మతస్థుడవు అయిన, ఏ కులస్థుడవు అయినా ఆయనకు ఒక్కటే పని, అహంకారాన్ని తినటమే ఆయన పని. నీ అహంకారం నశించకుండా దుఃఖం నశించదు. ఎందుచేతనంటే దుఃఖం అంతా అహంకారరూపంలో ఉంది, వ్యక్తి భావన రూపంలో ఉంది. భగవంతుడిని కాదని నేను ఏదో సాధించగలను అని చెప్పే పొగరుబోతు నేను ఉంది కదా, వాడు చస్తేగాని దుఃఖం నశించదు. ఆ పొగరుబోతు నేనును తినటానికే భగవాన్ వచ్చారు. అక్కడ లాభం వచ్చింది, ఇక్కడ నష్టం వచ్చింది అని ఏదో అనుకొంటూ ఉంటారు. అక్కడ లాభం వచ్చినా, ఇక్కడ నష్టం వచ్చినా చేసేవాడు

ఒకడు ఉన్నాడు. వాడు లేడని నీకు తెలిస్తే ఇంక లాభం ఏమిటి? నష్టం ఏమిటి? అదీ నిన్ను బాధించదు, ఇదీ నిన్ను బాధించదు. బ్రహ్మజ్ఞాని వాడికి దేహం ఉన్నా దేహం లేనివాడితో సమానము. ఎందుచేతనంటే వాడికి దేహం ఉన్నా దేహంతో వాడికి తాదాత్మ్యం ఉండదు, వాడి ఏదిగా ఉన్నాడో దానితో తాదాత్మ్యం ఉంటుంది, అందుచేత వాడికి దేహం ఉన్నా లేని వాడితో సమానము. పుణ్యకర్మలు, పాపకర్మలు, వాసనలు, నేను ఆ పని చేసాను, నేను ఈ పని చేసాను అనే తలంపులు అన్నీ ఎక్కడ ఉన్నాయి, మనస్సులో ఉన్నాయి. నేను అది సాధించాను, నేను ఇది సాధించాను అని దేహం అనుకోదు, మనస్సే అనుకొంటుంది. ఆ మనస్సు ధ్వంసమయితే ఏమీ లేదు. జ్ఞానిని చూసి వాడు బాధపడుతున్నాడు అని మీరు అనుకోవచ్చుగాని నేను బాధపడుతున్నాను అనుకొనేవాడు అక్కడ లేడు. భగవాన్‌కి కేన్సర్ వచ్చింది. చూసేవారికి ఆయన ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాడు. ఒకసారి భగవాన్ అన్నారు నాకు ఒక దేహం ఉందని, ఆ దేహానికి రెండు చేతులు ఉన్నాయని, ఒక చేతిమీద కురుపు ఉందని మీరు చెపుతూ ఉంటే నాకు తెలుస్తోంది అని చెప్పారు. లోకంలో ఉండగా లోకానికి అతీతుడు, దేహంలో ఉండగా దేహానికి అతీతుడు, వాడే జ్ఞాని. కర్త ఉంటే కర్మ వాడిని పీడిస్తుంది. కర్త లేనివాడిని కర్మ ఏమి పీడిస్తుంది. శరీరం ఉన్న వాడికి రోగం కాని శరీరం లేనివాడికి రోగం ఏమిటి?

మీరు మంచి పని చేసారు అనుకోండి, ఎవరూ గుర్తించరు అనుకోండి, మీకు బాధ వస్తుంది. ఇంట్లో చాలా చాకిరి చేస్తున్నాము, ఎవరూ గుర్తించటం లేదు అంటారు. గుర్తింపులు లేకుండా మనస్సుకు అస్థిత్వం లేదు. ఇంట్లో ఏడుపు, బయటకు వస్తే ఏడుపు, ఎక్కడికి వెళ్ళినా ఏడుపే, గుర్తింపుల వలన వచ్చే గోల ఇది. గుర్తింపు లేకుండా అహంకారం బతకలేదు. ఆ గుర్తింపులు మీ కొంపలు తీస్తున్నాయి అని మీకు అర్థమవ్వటం లేదు. వీటి వలన పునర్జన్మలకు వాసనలు పడతాయి. ఈ దేహం నేను అనుకొని పని చేస్తే మంచికి మంచి, చెడుకు చెడు, ఎత్తుకు ఎత్తు అనుభవించవలసిందే. దేహంతో తాదాత్మ్యం లేకుండా చేసింది నిన్నేమీ అంటదు, నిన్ను ముట్టుకోదు, అది పునర్జన్మ హేతువుకాదు. మీలో చాలామంది ధనవంతులు ఉండవచ్చు, పది డిగ్రీలు ఉన్నవారు ఉండవచ్చు అయితే మీకు దుఃఖం ఎందుకు వస్తోంది. బాహ్యంగా చూస్తే మీకు ఏమీ లోటు లేదు. అయితే దుఃఖం ఎందుకు వస్తోంది. కారులలో నుండి, డబ్బులో నుండి, పదవులలో నుండి శాంతి రాదు. డబ్బు వలన కొన్ని కంఫర్ట్సు రావచ్చు. ఆనందం, సుఖం, శాంతి లోపల నుండే రావాలి, అవి బయట నుండి వచ్చేవి కావు. లోపల నుండి ఆనందం, శాంతి మీకు అందుతూ ఉంటే బాహ్య పరిస్థితులు ఎలా ఉన్నా అవి మీ ఆనందానికి అడ్డురావు. ఈ మధ్య ఒక భక్తుడి ఇంట్లో దొంగతనం

జరిగింది. 2 కాసుల బంగారం, 30వేల డబ్బు పట్టుకెళ్ళిపోయారు. ఆయన ఏమి చెప్పారు అంటే నేను పొందే శాంతిని, ఆనందాన్ని వాడు పట్టుకెళ్ళలేదు, నా భౌతికసంపదను తీసుకొనిపోయాడు, నా ఆధ్యాత్మికసంపదను వాడు తీసుకొని వెళ్ళలేదు అన్నారు. దేహానికి వచ్చే చావు కూడా నా ఆధ్యాత్మికసంపదను పట్టుకొని వెళ్ళలేదు, ఈ దొంగ ఎక్కడ పట్టుకొని వెళ్ళగలడు అన్నారు. గతించిన గొడవలు పూర్తిగా మర్చిపో, అస్తమాను వాటిని జ్ఞాపకం తెచ్చుకొంటూ ఉంటే అదే మాయ. మంచి ప్రారబ్దం, చెడు ప్రారబ్దం అంతా స్వప్నమే. అది స్వప్నం అని నీకు తెలియటం లేదు, అది నిజం అనుకోవటం వలన నీకు దుఃఖం వస్తోంది. దేహము నేను అనే తలంపు నిజం అనుకోవటం వలన అదృష్టం, దురదృష్టం నిజం అని నీకు అనిపిస్తోంది. అందుచేత నీవు సాధన చేసి దేహము నేను అనే తలంపును తొలగించుకో. ఒక్కసారి హైజంప్ చేసి ఆ తలంపు నుండి బయటపడదాము అనుకోవద్దు. నీవు జాగ్రత్తగా క్రమశిక్షణ అలవాటు చేసుకొని దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి.

నీవు సాధన చేసేటప్పుడు ఆటంకాలు వస్తాయి, కంగారు పడకు. నెమ్మదిగా అభ్యాసం చేస్తూ, లోపల వైరాగ్యం పెంచుకొంటూ వాటిని తొలగించుకో. ఒకవేళ నీకు పుణ్యప్రారబ్దం వెంటాడుతూ ఉంటే అదే నిజం అనుకొని పొంగిపోవద్దు. నీవు ఎగిరి ఎగిరి పడుతున్నావు అనుకో, అది నీ అహంకారానికి గుర్తు. నీవు ఎందుకు ఎగిరి పడుతున్నావో కారణం నీకు తెలియకపోతే నీవు ఎగిరిపడటం మానవు. లోకంలో చాలాసంపద ఉంది కాని భగవంతుడు మీకు ఎంత అయితే కేటాయించాడో అది మాత్రమే మీకు వస్తుంది. మీరు కోరుకొన్నా ఎక్కువ రాదు. అంత సంపద మాకు వద్దు అని మీరు అనుకొన్నా అంత సంపద మీకు వస్తుంది. భగవంతుడు మీకు కేటాయించింది మీకు వచ్చి తీరుతుంది, పది మంది దానిని ఆపాలన్నా ఆగదు. మీకు కేటాయించనది మీరు ప్రయత్నం చేసినా రాదు. మీరు జపం చేసినా, ధ్యానం చేసినా మనో దేహములతో తాదాత్మ్యం తగ్గించుకోండి. మనో దేహములతో తాదాత్మ్యం తగ్గిపోతే మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, ఎవరైనా విమర్శించినా కూడా ఏమీ అనిపించదు, దున్నపోతు మీద వర్షం కురిసినట్లుగా ఉంటుంది. మనో దేహములతో ఉన్న తాదాత్మ్యం తొలగించుకోవటానికి మీరు ప్రయత్నం చేస్తూ ఉంటే అంతర్యామిగా ఉన్న నారాయణుడు చూస్తున్నాడు కదా, ఆయన మీ అహంకారాన్ని ఎక్కడికి గెంటేయాలో అక్కడకు నెట్టేసి, దానిని కాల్చి బూడిద చేసి, మీకు అమృతానుభవాన్ని కలుగజేస్తాడు. అమృతానుభవం మీకు కలిగింది అనుకోండి ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు, ప్రయాణాలు చేయనక్కరలేదు, ఇంక మీకు దుఃఖం లేదు, జన్మలు లేవు, బంధం లేదు, ఏమీ లేదు. అట్టి స్థితిని మీకు ప్రసాదించేవాడే గురువు, వాడే నారాయణుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 13-11-06 సోమ | జువ్వలపాలెం |
| 19-11-06 ఆది | తణుకు క్షత్రియ కళ్యాణ మండపం |
| 20-11-06 సోమ | గొరగనమూడి |
| 28-11-06 మంగళ | పాతాళ మెరక |
| 29-11-06 నుండి 05-12-06 వరకు అరుణాచలం క్యాంపు | |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# నిజమైన నేను

నేను అని ఉచ్ఛరించకుండా మనము ఉండలేము. అట్టి 'నిజమైన-నేను' యొక్క లక్ష్యార్థము సచ్చిదానంద పరమాత్మయే! నిత్యానంద అద్వయ స్వరూపమగు ఏ రసము నందు యోగులు నిరంతరముగా రమించుచుందురో అట్టి తత్త్వమే నిజమైన-నేను. నాకు తెలియబడే సర్వమునూ 'నేతి-నేతి' అని నిషేధించగా మిగిలెడి శుద్ధ తత్త్వమే నిజమైన-నేను.

అహం శబ్ద లక్ష్యార్థము, అహంవృత్తికి సాక్షియైనది, నిష్ప్రపంచ స్వరూపము అగు కేవల ఉనికియే 'నిజమైన-నేను'.

గమనాగమనములు, జనన మరణములు మున్నగు వికారములు లేని నిర్గుణ, నిరాకార తత్త్వమే 'నిజమైన-నేను'. తత్త్వమస్యాది మహావాక్యములందు 'తత్' పద అర్థమే 'నిజమైన-నేను'. ఏ నిజమైన నేను ఆధారముగా లేనిదే నేను, నీవు అను వ్యవహారమే లేదని తెలుసుకొను జ్ఞానమే 'నిజమైన-నేను'. సకల చరాచర జగత్తుకు ఆధారమైనది, శాంతియే స్వరూపముగా కలిగిన అట్టి తత్త్వమును 'తాను'గా అనుభవములోనికి తెచ్చుకొనుటయే మానవ జీవిత గమ్యము.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

# బ్రహ్మంలో బహుళత్వం లేదు - బహుళ్వాన్ని కల్పించుకొంటే భంగపడతావు

పరబ్రహ్మం ఒక్కటే. దానికంటే వేరైనది ఏదైనా ఉంటే మనం కోరుకోవచ్చు. కళ్లల్లో దోషం ఉంటే రెండు చంద్రులు కనిపిస్తారు. ఆత్మ జ్ఞానం కలగనంతకాలం మనకన్న భిన్నంగా రెండవ వస్తువు ఉన్నట్లుగా కనిపిస్తుంది. అద్దాల గదిలోకి మనం వెడితే మన రూపమే అనేక రకాలుగా ఉన్నట్లు కనిపిస్తుంది. మనకన్న బుద్ధిలో పరిణితి చెందని, పిచ్చుక, కుక్క బహుళత్వాన్ని కల్పించుకొని పొడుచుకొని, మొరిగి భంగపడతాయి. అద్దంలో ఎన్ని దృశ్యాలు కదలినా అద్దం ఎప్పుడూ వికార రహితంగానే ఉంటుంది. అలాగే మనం నిత్య జీవితంలో ఎవరైనా ఏదైనా అన్నా అద్దంలా ఉండాలి. తత్వ విచారణ ఉంటే, బహుళంగా కనిపించే, రూప-నామాలు అన్నీ పలాయనం అవుతాయి. అంటే మనలను ఎవరైనా పొడిగినా, విమర్శించినా, మనలను మనమే పొగుడుకొంటున్నట్లు, విమర్శించుకొన్నట్లుగా భావించాలి. సర్వత్ర సమదృష్టి కలగనంతకాలం ద్వేషబుద్ధి విడనాడనంత కాలం, ధ్యానధారణ కలగటమే అసంభవం. మనస్సు దేనినైనా కోరి విచారిస్తూ ఉన్నా దేనినైనా ఆమోదించి, నిరాకరించినా, సంతోష విచారాలు పొందినా బంధింపబడినట్లే. బంధం అంటే ఏమిటో క్షుణ్ణంగా అర్థం చేసుకొన్న బుద్ధికి భంగపాట్లు ఉండవు. కైవల్య స్థితి ఊహ మాత్రంగానైనా అందుతుంది. శ్రీనాన్నగారు అంటారు "మిమ్ములను ఎవరైనా ఎలా ఉంటున్నారు? అంటే తలపోటు అనో, రొంప అనో, బి.పి. మోకాళ్ళ నెప్పలనో అంటూ ఎన్నో రోగాలు చెప్పకొంటారు. అవి అన్నీ శరీరానికి సంబంధించినవి మాత్రమే. ఆ రోగాలు ఆత్మకు ఏమీ లేవు అవి అన్నీ మీకే అని ఆరోపించుకొని గోల గోల క్రింద ఉంటున్నారు" అన్నారు. కాబట్టి ఆ బ్రహ్మమే మనం అనే భావాన్ని సదా నిలుపుకోవాలి. గురు భక్తివల్ల బ్రహ్మ పదాన్ని అనుభవించటం సాధ్యమౌతుంది. స్ఫటికాన్ని నల్లగుడ్డపై పెట్టినా, ఎఱ్ఱ గుడ్డపై పెట్టినా, నేను నలుపైపోయాను తీసేయండి అని ఏడవదు. లేదా నేను ఎఱ్ఱగా ఉన్నానని మురిసిపోదు. నిజానికి స్ఫటికంలో ఏ రంగూ లేదు. అన్నీ కల్పించబడ్డవే, అలాగే మనం పెళ్ళి కూతుల్లు నలుపు అయితే ఏడుపు, పెడబొబ్బలు, తిరస్కారం. ఎరుపైతే ఆనందం, స్వీకారం. దైవీ సంపద అక్కరలేదు. ఈ సురూపాలు, కురూపాలు ఆ లీలామానుషమూర్తి వేసుకొన్న వేషాలు. మన కళ్ళు తెరిపించటానికి ఆడే నాటకం. ఆత్మలో బహుళత్వం లేదు. ఈ నిజాన్ని గ్రహించి, నిర్మలంగా నిశ్చలంగా జీవించటమే జీవిత ధర్మము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం